

అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

12.11.2026
బుధవారం | రంగారెడ్డి
సంపుటి : 01 | సంచిక: 133
పేజీలు : 08 | వెల: రూ.5

AJS
అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.

మళ్లీ మున్సిపల్ ఎన్నికలు నవంబర్ 26న పోలింగ్

కోర్టు వివాదాలు క్లియర్ కావడంతో

రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయం


2లో..

దేశంలోనే నెంబర్ 1గా విశాఖ

- మూడో స్థానంలో విజయవాడ, గుంటూరు
- స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26 సర్వేలో
- స్వచ్ఛతా ర్యాంకింగ్స్‌లో మెరుగు
- విజయవాడ దేశంలోనే మూడో అత్యంత స్వచ్ఛమైన సీటీ

2లో..



న్యూఢిల్లీ, నవంబర్ 11, అనంత జనశక్తి న్యూస్

దేశంలోనే ఏపీలోని మూడు నగరాలు టాప్‌లో నిలిచాయి. టాప్ 1లో విశాఖపట్న ఉండగా.. విజయవాడ, గుంటూరు నగరాలు మూడో స్థానంలో ఉన్నాయి. దేశవ్యాప్త స్వచ్ఛతా ర్యాంకింగ్స్‌లో ఏపీ నుంచి విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు నగరాలు నేషనల్ లెవల్లో పురస్కారాలు సొంతం చేసుకున్నాయి. అంతేకాదు న్యూఢిల్లీలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విజేతలకు అవార్డులను అందజేయడం జరిగింది.

టేకాఫ్ వేళ హైజాక్ అలర్ట్

ఎయిర్ ఇండియా విమానం నుంచి..
కోల్‌కతా విమానాశ్రయంలో షాకింగ్ ఘటన
రంగంలోకి సీఐఎస్ఎఫ్
సీసీటీవీ దృశ్యాల ఆధారంగా విచారణ
విమానం టాయిలెట్ అద్దంపై కన్పించిన హైజాక్ బెదిరింపు

2లో..

బ్లూ కాలర్ జాబ్‌లకు ముప్పులేదు

- టెక్నాలజీ ఎంత పెరిగితే అంత మంచిది
- సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి
- మైనార్టీలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాం
- మైనార్టీలకు అన్ని రకాలుగా అండగా ఉంటోంది
- విద్య, మైనార్టీల సంక్షేమ దినోత్సవ కార్యక్రమంలో సీఎం
- నెహ్రూ వేసిన పునాదుల వల్లే రంగాల్లో అభివృద్ధి
- విద్య, నీటిపారుదలకు అధిక ప్రాధాన్యత
- ఐఐటీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది
- ఇచ్చిన మాట ప్రకారం అజారుద్దీన్‌కు మంత్రి పదవి



హైదరాబాద్, నవంబర్ 11, అనంత జనశక్తి న్యూస్

తమ ప్రభుత్వం మైనార్టీలకు అన్ని రకాలుగా అండగా ఉంటోందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీలకు విద్య, ఉద్యోగాల్లో 4 శాతం రిజర్వేషన్లు కల్పించిందని చెప్పారు. సేవాలాల్ బంజారా భవన్‌లో జాతీయ విద్య, మైనార్టీల సంక్షేమ దినోత్సవ కార్యక్రమంలో సీఎం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.

నెహ్రూ వేసిన పునాదుల వల్లే ఆ రెండు రంగాల్లో అభివృద్ధి

తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ విద్య, నీటిపారుదలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని రేవంత్ చెప్పారు. నాడు ఆయన వేసిన పునాదుల వల్లే ఆ రెండు రంగాల్లో వృద్ధి సాధించామన్నారు.

దేశవ్యాప్తంగా యూనివర్సిటీలతో పాటు ఐఐటీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని చెప్పారు. ''ప్రసిద్ధిగాంచిన వర్సిటీలు, ఐఐటీలను ఏర్పాటు చేసిందెవరో యువత గుర్తుచేసుకోవాలి. ఆనాడు పడిన పునాదుల వల్లే నేడు భారతీయులు ప్రపంచ ప్రఖ్యాత సంస్థలకు సీఈవోలు అయ్యారు. ఇప్పుడు కంపెనీల అవసరాలకు అవసరమైన నైపుణ్యాలు యువతలో పెరగాలి. స్కిల్స్ పెంచేందుకే ఐటీఐలను ఏటీసీలుగా మార్చాం. మరిన్ని వసతులతో స్కిల్ యూనివర్సిటీ నిర్మిస్తున్నాం. ఏఐ వల్ల వైట్ కాలర్ జాబ్ అవకాశాలు ప్రమాదంలో పడ్డాయి. టెక్నాలజీ ఎంత పెరిగినా బ్లూ కాలర్ జాబ్‌లకు ముప్పులేదు.

ఇచ్చిన మాట ప్రకారం అజారుద్దీన్‌కు మంత్రి పదవి

విద్యార్థులను కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోంది. మైనార్టీలకు ఇచ్చే స్కాలర్‌షిప్‌లపై నా భాజపా రాజకీయం చేస్తోంది. క్రికెట్‌లో రాణిస్తున్న సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం ఇచ్చాం. షబ్బీర్ అలీ, అజారుద్దీన్, ఫిరోజ్‌ఖాన్‌కు పార్టీ టికెట్లు ఇచ్చాం. వారికి విజయం దక్కనప్పటికీ ఇచ్చిన మాట ప్రకారం అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చాం. మీరాలం చెరువుపై రూ.600 కోట్లతో కేబుల్ బ్రిడ్జి నిర్మిస్తున్నాం. అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తున్నాం. మూసీలో ఆక్రమణలు తొలగించి అభివృద్ధి చేస్తున్నాం. మూసీ సుందరీకరణ పూర్తయితే ఆ ప్రాంతంతో పాటు పాతబస్తీని చూసేందుకు ఎక్కడెక్కడి నుంచో పర్యాటకులు వస్తారు. మూసీ ప్రాజెక్టు పూర్తయితే నగరంలో నైట్ ఎకానమీ పెరుగుతుంది''అని రేవంత్ అన్నారు.

సీఆర్పీఎఫ్ జవాన్లు క్యాంప్‌పై ఉగ్రవాదులు దాడి



- జమ్మూ కాశ్మీర్‌లో ఘటన
- బైక్ వచ్చి కాల్పులు జరిపిన ఉగ్రవాదులు
- గాయపడిన జవాన్లు
- ఆస్పత్రికి తరలించి ట్రీట్‌మెంట్

2లో..

క్వాల్‌కామ్‌లో లేఆఫ్స్

- భారత్‌లో 1,000 మందికిపైగా వేటు
- దిగ్గజ చిప్‌మేకర్ క్వాల్‌కామ్
- గ్లోబల్ రీస్ట్రక్చరింగ్‌లో భాగంగా తొలగింపు

న్యూఢిల్లీ, నవంబర్ 11, అనంత జనశక్తి న్యూస్

2లో..

గ్లోబల్ పునర్వ్యవస్థీకరణ పేరుతో దిగ్గజ సెమీకండక్టర్ తయారీ సంస్థ క్వాల్‌కామ్ ఉద్యోగుల కోతను వేగవంతం చేసింది. అమెరికాలో మొదలైన లేఆఫ్స్ ప్రక్రియ ఇప్పుడు భారతదేశానికీ విస్తరించింది. అంతర్జాతీయంగా చేపడుతున్న సిబ్బంది తగ్గింపులో భాగంగా భారత్‌లో 1,000 మందికిపైగా ఉద్యోగులపై వేటు పడే అవకాశం ఉంది. ఈ క్రమంలో బెంగళూరులోని క్వాల్‌కామ్ సెంటర్‌లో సోమవారం నాడే తొలి విడత పిలుపులు, లేఆఫ్స్ ప్రక్రియ ప్రారంభమైనట్లు ఆర్థిక కథనాలు స్పష్టం చేస్తున్నాయి.

సింగపూర్ ప్రతినిధులతో లోకేశ్ భేటీ


5లో..

'పరివర్తన రాజనీతి పార్టీ'

- ఏపీ రాజకీయాల్లో కొత్త రాజకీయ శక్తి
- ప్రకటించిన విజయసాయిరెడ్డి
- దేశం కోసం, ధర్మం కోసం అనే నినాదం
- జెండాను పైన కాషాయం, కింద తెలుపు రంగులు
- మధ్యలో చక్రంతో రూపొందించారు


5లో..

నిందితుడి కాలు భద్రపరచాలి

రాప్తాడు దాడి కేసులో

- ఏపీ హైకోర్టు కీలక ఆదేశాలు
- (సీబీఐ) విచారణ కోరుతూ దాఖలైన పిటిషన్
- కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలి
- ప్రభుత్వాన్ని ఆదేశించిన ధర్మాసనం
- విచారణను డిసెంబర్ 30కు వాయిదా

5లో..

2024తో పోలిస్తే వైసీపీ ఓటింగ్ పెరిగింది

- మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- ఎంతో కసితో, పట్టుదలతో ఎన్నికల్లో పోరాటం
- ప్రభుత్వం చేసిన అక్రమాలను ప్రజలంతా చూశారు
- ప్రతి దశలోనూ అరాచకాలు, అన్యాయాలు

అమరావతి, నవంబర్ 11, అనంత జనశక్తి న్యూస్

ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల తీరుపై వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.. ఎన్నికల సందర్భంగా చోటు చేసుకున్న పరిణామాలపై పార్టీ నాయకులతో చర్చించారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో పలు జిల్లాలకు చెందిన పార్టీ నాయకులు జగన్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో చోటుచేసుకున్న పరిణామాలు, పార్టీ విజయాలు, ఓటింగ్ శాతాలు, ఎన్నికల నిర్వహణలో జరిగినట్లు భావిస్తున్న అక్రమాలపై నాయకులతో ఆయన సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ.. పార్టీ కేడర్ మొత్తం ఎంతో కసితో, పట్టుదలతో ఎన్నికల్లో పోరాటం చేసిందని అన్నారు. చంద్రబాబు ప్రభుత్వం చేసిన అక్రమాలను ప్రజలంతా చూశారని, వాస్తవాలను ప్రజలు కూడా బాగా అర్థం చేసుకున్నారని పేర్కొన్నారు. 2024 ఎన్నికలతో పోలిస్తే వైసీపీ ఓటింగ్ శాతం పెరిగిందని వెల్లడించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల నాటి నుంచి ఓట్ల లెక్కింపు వరకు ప్రతి దశలోనూ అరాచకాలు, అన్యాయాలు చోటుచేసుకున్నప్పటికీ వైసీపీ ఓటింగ్ శాతం పెరగడం పార్టీ పట్ల ప్రజల్లో ఉన్న ఆదరణకు నిదర్శనమని వ్యాఖ్యానించారు

5లో..

ఎన్ని పోరాటాలు చేసినా మార్పు రావడం లేదు

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అభివృద్ధి లేదు
- ఓటు ద్వారా ఇచ్చే తీర్పుతోనే మార్పు సాధ్యం
- 4 కోట్ల మందిలో 80 లక్షల మంది గ్రాడ్యుయేట్లు
- 80 లక్షల్లో 10 లక్షల మంది కూడా నమోదు చేసుకోలేదు


2లో..



సీఆర్పీఎఫ్ జవాన్లు క్యాంప్‌పై
ఉగ్రవాదులు దాడి

శ్రీనగర్, నవంబర్ 11, అనంత జనశక్తి న్యూస్

జమ్మూకశ్మీర్‌లో బుధవారం ఉగ్రదాడి చోటుచేసుకుంది. కుల్గామ్‌లోని సీఆర్పీఎఫ్ క్యాంప్‌పై ఉగ్రవాదులు దాడి చేశారు. జవాన్లపై తీవ్రవాదులు కాల్పులు జరపడంతో భద్రత బలగాలు అప్రమత్తమయ్యాయి. ముష్కరుల కాల్పులను తిప్పికొడుతున్నాయి. ఈ ఘటనలో ఇద్దరు సీఆర్పీఎఫ్ జవాన్లు గాయపడ్డారు. కుల్గాం జిల్లాలో ఈ మధ్యాహ్నం నకా ప్రాంతంలో సీఆర్పీఎఫ్ పోస్ట్ వద్ద భద్రతా సిబ్బందిపై మోటార్ సైకిల్‌తో వచ్చిన దుండగులు కాల్పులు జరపడంతో జవాన్లకు గాయాలైనట్టు అధికారులు తెలిపారు. మధ్యాహ్నం సుమారు 2.15 గంటలకు ఈ ఘటన జరిగిందని పేర్కొన్నారు.

గుర్తుతెలియని దుండగులు సీఆర్పీఎఫ్ సిబ్బందిపై కాల్పులు జరిపి అక్కడి నుంచి పారిపోయారని, గాయపడిన సిబ్బందిని చికిత్స కోసం అనంతనాగ్ జిల్లాలోని ఆసుపత్రికి తరలించినట్లు సీఆర్పీఎఫ్ తెలిపింది. పరారైన ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు గాలింపు చేపట్టాయి. ఆ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించినట్టు అధికారులు తెలిపారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో ఒక్కసారిగా అలజడి రేగింది. అదనపు బలగాలను మోహరించి, ఆ ప్రాంతమంతా జల్లెడ పడుతున్నారు.

మళ్లీ మున్సిపల్ ఎన్నికలు
నవంబర్ 26న పోలింగ్

అమరావతి, నవంబర్ 11, అనంత జనశక్తి న్యూస్

న్యాయపరమైన చిక్కుల్లో చిక్కుకొని వాయిదా పడుతూ వస్తున్న ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ మళ్లీ తుది దశకు చేరింది. కోర్టు వివాదాలు తొలగిపోవడంతో మిగిలిపోయిన పలు నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలకు తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన సమగ్ర పోలింగ్ ప్రణాళికను ఎస్ఈసీ అధికారికంగా ఖరారు చేసింది. రాష్ట్రంలో ఇప్పటికే షెడ్యూల్ చేసిన మొదటి దశ పంచాయతీ ఎన్నికలతో పాటుగానే, ఈ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు కూడా పోలింగ్ నిర్వహించాలని ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. ఈ ఎన్నికల నిర్వహణకు సంబంధించి నవంబర్ 12వ తేదీన అధికారిక ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నారు. నోటిఫికేషన్ వెలువడిన అనంతరం నామినేషన్ల స్వీకరణ, పరిశీలన పూర్తి చేసి, నవంబర్ 26వ తేదీన ఓటింగ్ ప్రక్రియను నిర్వహించనున్నారు.

ఆయా స్థానిక సంస్థల పరిధిలో ఎన్నికల నిర్వహణ అధికారుల నియామకం, ఓటర్ల జాబితా తనిఖీ, రిజర్వేషన్ల ప్రక్రియను అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు. లీగల్ క్లియరెన్స్ రావడంతో 4 ప్రముఖ మున్సిపల్ కార్పొరేషన్లలో ఎన్నికల వేడి మొదలైంది. అవి శ్రీకాకుళం, కాకినాడ, రాజమహేంద్రవరం (రాజమండ్రి), మంగళగిరి తాడేపల్లి.



రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో నిలిచిపోయిన 19 మున్సిపాలిటీల్లో పోలింగ్ నిర్వహించేందుకు ఎస్ఈసీ పచ్చజెండా ఊపింది. ఆముదాలవలస, రాజాం, పాలకొల్లు, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, చింతలపూడి, గుడివాడ, తాడిగడప, పొన్నూరు, నర్సరావుపేట, బాపట్ల, కందుకూరు, పొదిలి, కావలి, గూడూరు, అల్లూరు, శ్రీకాళహస్తి, బి.కొత్తకోటలో ఎన్నికలు జరగనున్నాయి. గతంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన 13 నగరపాలక సంస్థలు, 92 పురపాలక సంఘాల ఎన్నికల్లో అధికార కూటమి పార్టీలు భారీ విజయాన్ని సాధించి తమ ఆధిక్యాన్ని చాటుకున్నాయి. అయితే వార్డుల పునర్విభజన, రిజర్వేషన్లు, ఇతర సాంకేతిక కారణాల వల్ల పలు కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఎన్నికలు నిలిచిపోయాయి.

ఇటీవల న్యాయస్థానాల్లో ఈ వివాదాలను పరిష్కరించడంతో ఎలాంటి ఆటంకాలు లేకుండా ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ సన్నాహాలు పూర్తి చేస్తోంది. దీనితో ఆయా పట్టణాల్లో రాజకీయ సమీకరణాలు ఒక్కసారిగా వేడెక్కాయి.

రాష్ట్రంలో 13,171 గ్రామ పంచాయతీలకు మూడు దశల్లో పోలింగ్ నిర్వహించేందుకు ఎస్ఈసీ రెడీ అయింది. వాటితోపాటుగానే.. మున్సిపల్ ఎన్నికలు నిర్వహించనుంది. గ్రామపంచాయతీలకు ఈ నెల 12న ఎన్నికల నోటిఫికేషన్లను విడుదల చేస్తుంది. తొలి దశ పోలింగ్ 26 నవంబర్, రెండో దశ పోలింగ్ 29, మూడో దశ పోలింగ్ 2 డిసెంబర్‌న జరుగుతాయి.

ఎన్ని పోరాటాలు చేసినా
మార్పు రావడం లేదు



హైదరాబాద్, నవంబర్ 11, అనంత జనశక్తి న్యూస్

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎన్ని పోరాటాలు చేసినా మార్పు రావడం లేదని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శలు గుప్పించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ఓటు ద్వారా ఇచ్చే తీర్పుతోనే మార్పు సాధ్యమన్నారు. త్వరలో రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. 4 కోట్ల మందిలో 80 లక్షల మంది గ్రాడ్యుయేట్లు ఉన్నారని చెప్పారు. అయితే 80 లక్షల్లో 10 లక్షల మంది కూడా నమోదు చేసుకోలేదన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కవిత కోరారు. వారి ఓటుతో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు బుద్ధి చెప్పే అవకాశం ఉందన్నారు. దేశ వ్యాప్తంగా 8 మంది యువ ఎంపీలు ఉంటే ఒక్కరే పొలిటికల్ బ్యాక్ గ్రౌండ్ లేనివారు ఉన్నారని చెప్పారు. తెలంగాణ ప్రజలు తమకు మద్దతు ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ రూ.200 కోట్లు ఖర్చు చేసి ఈ ఎన్నికల్లో గెలవాలని చూస్తోందని ఆరోపించారు. యువత డబ్బులకు అమ్ముడు పోకుండా ఓట్లు వేయాలని సూచించారు.

77 నియోజకవర్గాల్లో ఈ ఎన్నికలు జరుగుతున్నాయని.. నేటి నుంచి అధికారికంగా ప్రచారాన్ని ప్రారంభించినట్లు కవిత వెల్లడించారు. టీఆర్ఎస్ అభ్యర్థులకు వీర తిలకం దిద్ది యుద్ధరంగంలో దింపుతున్నామని చెప్పారు. కలిసి వచ్చే పార్టీలతో ఎన్నికల్లో ముందుకు వెళ్తామని వెల్లడించారు. టీఆర్ఎస్ పార్టీకి ఎన్నికల సంఘం అధికారిక గుర్తింపు ఉందన్నారు. కొన్ని అభ్యంతరాలు వచ్చాయని.. వాటికి సంబంధించిన సమస్యలు త్వరలో పరిష్కారమవుతాయని కవిత పేర్కొన్నారు.

దేశంలోనే నెంబర్ 1గా విశాఖ

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ 202526 వార్షిక సర్వేలో ఏపీ నగరాలు తమ సత్తా చాటాయి. వివిధ కేటగిరీలలో ఆంధ్రప్రదేశ్ ఆరు అవార్డులు సొంతం చేసుకుంది. పది లక్షల పైబడిన జనాభా కేటగిరీలో గ్రేటర్ విశాఖపట్నం దేశంలోనే క్లీనెస్ట్ సిటీగా మొదటి ప్లేస్‌లో నిలిచింది. తర్వాతి స్థానాల్లో జబల్‌పుర్, లక్నో వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. అదేవిధంగా మూడు నుంచి 10 లక్షల జనాభా విభాగంలో మధ్య ప్రదేశ్‌లోని ఉజ్జయిన్ తొలి స్థానంలో ఉండగా.. చండీగఢ్ రెండో స్థానంలో, గుంటూరు మూడో స్థానంలో నిలిచి సత్తా చాటాయి. అన్ని ర్యాంకింగ్స్ పరిశీలిస్తే.. మహారాష్ట్రకు చెందిన నవీ ముంబై దేశంలోనే అత్యంత క్రీన్‌గా ఉండే నగరంగా ఫస్ట్ ప్లేస్‌ని దక్కించుకుంది. గుజరాత్‌కు చెందిన సూరత్ రెండో స్థానంలో, విజయవాడ మూడో స్థానాన్ని సొంతం చేసుకున్నాయి.



4,751 నగరాల్లో పరిశుభ్రతా సర్వే...

కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ చేపట్టిన 'స్వచ్ఛ సర్వేక్షణ్' పదో ఎడిషన్‌లో భాగంగా సుమారు 4 వేల 7 వందల 51 నగరాలను పరిగణనలోకి తీసుకుని ఈ పరిశుభ్రతా సర్వేను నిర్వహించడం జరిగింది. గత ఏడాది ఇదే లీగ్‌లో ఇండోర్ మొదటి స్థానాన్ని దక్కించుకోగా, సూరత్ రెండో స్థానంలో, నవీ ముంబై మూడో ప్లేస్‌లో నిలిచాయి. అలాగే నదీతీర సిటీల విభాగంలో మధ్య ప్రదేశ్‌లోని రేవా అగ్రస్థానాన్ని దక్కించుకోగా... ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ రెండో స్థానంలో, ఉత్తర ప్రదేశ్‌లోని వారణాసి మూడో స్థానంలో నిలిచాయి. ఇక తీరప్రాంత పట్టణాల కేటగిరిలో ఒడిశాలోని పూరీ మొదటి స్థానంలో నిలవగా, కేరళకు చెందిన అలప్పుళ ద్వితీయ స్థానాన్ని, మహారాష్ట్రకు చెందిన రత్నగిరి తృతీయ స్థానాన్ని సొంతం చేసుకున్నాయి. అలాగే హిమాలయ ప్రాంత నగరాలు ఉత్తరాఖండ్‌లోని రుద్రపూర్ ప్రథమ స్థానంలో నిలవగా, జమ్ము రెండో స్థానంలో నిలిచింది.

టేకాఫ్ వేళ హైజాక్ అలర్ట్

న్యూఢిల్లీ, నవంబర్ 11, అనంత జనశక్తి న్యూస్

కోల్‌కతాలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో బుధవారం ఉదయం ఒక ఊహించని సంఘటన తీవ్ర భయాందోళనలను రేకెత్తించింది. కోల్‌కతా నుంచి ముంబయి నగరానికి బయలుదేరేందుకు సిద్ధంగా ఉన్న ఎయిర్ ఇండియా ప్రయాణికుల విమానంలో ఒక్కసారిగా హైజాక్ అలర్ట్ మోగడంతో విమానాశ్రయం మొత్తం అత్యంత అప్రమత్తమైంది. విమానం రన్‌వే పైకి వెళ్లేందుకు సిద్ధపడుతున్న కీలకమైన క్షణాల్లో ఈ తీవ్ర భద్రతా ముప్పు వెలుగులోకి రావడంతో అధికారులు వెంటనే రంగంలోకి దిగాల్సి వచ్చింది. విమానంలోని టాయిలెట్లలోని ఒక అద్దంపై అపరిచిత వ్యక్తులు రాసిన ఒక హెచ్చరిక సందేశం కనిపించడమే ఈ కలకలానికి ప్రధాన కారణమని ప్రాథమిక సమాచారం ద్వారా తెలుస్తోంది. విమానాన్ని హైజాక్ చేయబోతున్నామనే రీతిలో ఉన్న ఆ బెదిరింపు రాతలను గమనించిన విమాన సిబ్బంది వెంటనే విషయాన్ని పైలట్ దృష్టికి తీసుకెళ్లారు. పరిస్థితి యొక్క తీవ్రతను మరియు ప్రయాణికుల రక్షణను దృష్టిలో ఉంచుకుని పైలట్



ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ అధికారులకు అత్యవసర 'హైజాక్ అలర్ట్' సమాచారాన్ని అందించారు. సమాచారం అందుకున్నవెంటనే ఎయిర్‌పోర్ట్ అథారిటీ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు చేపట్టింది. విమానం టేకాఫ్‌ను తక్షణమే నిలిపివేసి, దానిని అత్యంత సురక్షితమైన ఐసోలేషన్ బే ప్రాంతానికి తరలించారు. అనంతరం కేంద్రీయ పారిశ్రామిక భద్రతా దళం సిబ్బందితో పాటు విమానాశ్రయ ప్రత్యేక భద్రతా బృందాలు విమానాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. విమానంలో ఉన్న ప్రయాణికులు, వారి లగేజీలతో పాటు విమానంలోని మూలమూలలను, సందేహాస్పద ప్రాంతాలను నిపుణులైన భద్రతా బలగాలు క్షుణ్ణంగా తనిఖీ చేయడం ప్రారంభించాయి. ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లేదా ప్రమాదకర పదార్థాలు లేవని నిర్ధారించుకోవడానికి ఈ విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ తీవ్ర భద్రతా ఉల్లంఘన సంఘటనపై స్థానిక పోలీసులు, ఇతర కేంద్ర నిఘా ఏజెన్సీలు ఉమ్మడిగా సమగ్ర దర్యాప్తును ప్రారంభించాయి. విమాన టాయిలెట్ అద్దంపై ఆ బెదిరింపు సందేశాన్ని ఎవరు రాశారు, దాని వెనుక ఉన్న అసలు కారణాలు ఏమిటి అనే విషయాలపై ఆరా తీస్తున్నారు. ఇందులో భాగంగా విమానాశ్రయంలోని ప్రయాణికుల కదలికలు, బోర్డింగ్ పాయింట్ల వద్ద నమోదైన సీసీటీవీ దృశ్యాలను, అలాగే విమానం లోపల ఉన్న ఇతర కెమెరా ఫుటేజీలను అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు. అధికారులు ఈ ఘటనపై పూర్తి వివరాలను సేకరిస్తూ భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

మ్యూజియం, మెట్రో సహా అభివృద్ధి
పనులకు రూ.77,101 కోట్లు

- కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు
- మ్యూజియం, మెట్రో సహా అభివృద్ధి పనులకు 77,101 కోట్లు
- రబీ 2026-27 సీజన్‌కు ఎరువుల సబ్సిడీకి రూ.62,370 కోట్లు
- ప్రపంచంలోనే అతిపెద్ద మ్యూజియాన్ని అభివృద్ధి

ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. దేశంలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు రూ.77,101 కోట్లకు పైగా కేటాయించింది. ఢిల్లీలో యుగే యుగీన్ భారత్ మ్యూజియం ఏర్పాటుకు రూ.3,230 కోట్లు, నోయిడా - గ్రేటర్ నోయిడా మెట్రో విస్తరణ ప్రాజెక్టుకు రూ.2,390 కోట్లు, రబీ 202627 సీజన్‌కు ఎరువుల సబ్సిడీ కోసం రూ.62,370 కోట్లు, సూక్ష్మ పరిశ్రమలకు క్రెడిట్ గ్యారెంటీ ఫండ్ కోసం రూ.5,000 కోట్లు, స్టాండ్ అప్ ఇండియా పథకం క్రెడిట్ గ్యారెంటీ ఫండ్ కోసం రూ.4,111 కోట్లు కేటాయించింది.

ముఖ్యంగా 'యుగే యుగీన్ భారత్ మ్యూజియం' ఏర్పాటుకు ఆమోదం లభించింది. ఢిల్లీలోని చారిత్రక నార్త్ బ్లాక్, సౌత్ బ్లాక్ భవనాల్లో సుమారు 1,78,509 చదరపు మీటర్ల విస్తీర్ణంలో రూ. 3,230 కోట్ల అంచనా వ్యయంతో ప్రపంచంలోనే అతిపెద్ద మ్యూజియాన్ని అభివృద్ధి చేయనున్నారు. భారతదేశ నాగరికత, సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్రను ప్రపంచానికి సముచిత రీతిలో చాటిచెప్పేలా ఈ మ్యూజియం రూపుదిద్దుకోనుంది. ఈ ప్రాజెక్టును చారిత్రక భవనాల వారసత్వానికి ఎలాంటి నష్టం కలగకుండా ఆధునిక మ్యూజియంగా మార్చనున్నారు. 202627 నుంచి 203031 వరకు దశలవారీగా ఈ ప్రాజెక్టును అమలు చేయాలని ప్రణాళిక రూపొందించగా, 2027 ద్వితీయార్థంలో తొలి గ్యాలరీని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో ప్రదర్శించడం కోసం ఇప్పటికే నేషనల్ మ్యూజియం, కేంద్ర సాంస్కృతిక శాఖ మ్యూజియంలతో పాటు ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా కి చెందిన 52 ప్రదేశాల మ్యూజియంల నుంచి దాదాపు 18 లక్షల చారిత్రక వస్తువులను సేకరించి గుర్తించారు.

ఈ మ్యూజియంలో ఆర్కిటెక్చర్, నగర నిర్మాణాలు, గణితం, ఖగోళ శాస్త్రాలపై ప్రత్యేక గ్యాలరీలు కొలువుదీరనున్నాయి. దాంతో పాటు భారతీయ భాషలు, లిపులు, ఆధ్యాత్మికత, విశ్వాస సంప్రదాయాలపై ప్రదర్శనలతో పాటు భారత్‌ప్రపంచ దేశాల మధ్య కొనసాగిన వాణిజ్యం, ఆలోచనల అనుసంధానాన్ని ప్రతిబింబించే ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేస్తున్నారు. ఆధునిక సాంకేతికత, ఇమ్మర్సివ్ ఎక్స్‌పీరియన్స్‌తో సందర్శకులకు సరికొత్త అనుభూతిని అందిస్తూ, ఏడాదికి కోటి మంది సందర్శకులకు సేవలందించేలా దీనిని రూపొందిస్తున్నారు. టికెట్లు, గైడెడ్ టూర్లు, డిజిటల్ అనుభవాలు, వివిధ ఈవెంట్ల నిర్వహణ ద్వారా ఈ ప్రాజెక్టుకు ఆదాయ సమీకరణ జరగనుంది. మ్యూజియం నిర్మాణం, నిర్వహణ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా భారీగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ముఖ్యంగా కళాకారులు, శిల్పులు, పరిశోధకులు, డిజైనర్లు, పర్యాటక రంగానికి ఇది ఎంతో ప్రయోజనకరంగా మారనుంది. అంతేకాకుండా దేశీయంగా మ్యూజియం ఉత్పత్తుల తయారీకి అవకాశాలు కల్పిస్తూ 'మేక్ ఇన్ ఇండియా'కు పెద్దపీట వేయనున్నారు. భారత నాగరికతా వైభవాన్ని సగర్వంగా చాటిచెప్పే ఈ యుగే యుగీన్ భారత్ మ్యూజియం రాబోయే రోజుల్లో దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులకు అత్యంత ప్రధాన ఆకర్షణగా నిలవనుంది.

క్వాల్‌కామ్‌లో లేఆఫ్స్

(మొదటి పేజీ తరువాయి)

క్వాల్‌కామ్‌కు ప్రపంచవ్యాప్తంగా దాదాపు 52,000 మంది ఉద్యోగులు ఉన్నారు. సెప్టెంబర్ 2025 నాటికి ఉన్న లెక్కల ప్రకారం వీరిలో అత్యధికులు పూర్తికాల ఉద్యోగులే. కాగా, గ్లోబల్ రీస్ట్రక్చరింగ్‌లో భాగంగా మొత్తం సిబ్బందిలో దాదాపు 7 శాతం మందిని తొలగించాలని కంపెనీ భావిస్తోంది. భారత్‌లోనే క్వాల్‌కామ్‌కు సుమారు 20,000 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.

"ప్రపంచవ్యాప్త నిష్పత్తిని బట్టి చూస్తే భారత్‌లో దాదాపు 1,000 మంది లేదా అంతకంటే కాస్త ఎక్కువ మంది ఉద్యోగులపై ఈ లేఆఫ్స్ ప్రభావం పడే అవకాశం ఉంది" అని ఈఐఐఆర్‌ట్రెండ్ సీఈఓ, ప్రధాన విశ్లేషకుడు పారీఖ్ జైన్ వెల్లడించారు.

సెవెరెన్స్ ప్యాకేజీ వివరాలు

ఉద్యోగాలు కోల్పోతున్న ఉద్యోగులకు క్వాల్‌కామ్ పరిహార ప్యాకేజీని ఆఫర్ చేస్తోంది. కంపెనీ నిర్ణయం ప్రకారం బాధిత ఉద్యోగుల సర్వీసు కాలంతో ముడిపడి ఉన్న మూడు నెలల వేతనాన్ని సెవెరెన్స్ ప్యాకేజీగా అందిస్తున్నారు. లేఆఫ్ లేఖలు అందుకున్న మూడు రోజుల్లోగా రిలీవింగ్ పత్రాలపై సంతకం చేసే వారికి అదనంగా మరో నెల జీతాన్ని ఇస్తామని సంస్థ స్పష్టం చేసింది. మరోవైపు వచ్చే ఏడాది జనవరిలో

రెండో విడత ఉద్యోగాల తొలగింపులు కూడా ఉండే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

సీఈఓ లేఖతో స్పష్టత.. పర్ఫార్మెన్స్ ఫోకస్

గత అక్టోబర్ నెలలోనే క్వాల్‌కామ్ సీఈఓ క్రిస్టియానో అమోన్ ఉద్యోగులకు పంపిన అంతర్గత మెమోలో ఈ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ గురించి వివరించారు. "వ్యాపారాన్ని విస్తరిస్తున్న కొద్దీ దానికి తగిన నైపుణ్యాలు, సామర్థ్యాలు అవసరమవుతాయి. కంపెనీ నిరంతరం విజయవంతం కావాలంటే సరైన స్థానాల్లో సరైన వ్యక్తులు ఉండటం ఎంతో ముఖ్యం" అని అమోన్ ఆ లేఖలో స్పష్టం చేశారు. కంపెనీ వార్షిక పనితీరు సమీక్షలు ముగిసిన తర్వాత నవంబర్ నుంచి ఈ సిబ్బంది తగ్గింపు ప్రక్రియ ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు. అయితే భారత్‌లో లేఆఫ్స్‌పై కంపెనీ అధికారికంగా ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు.

కాలిఫోర్నియాలో 'వార్న్' నోటీసులు

అమెరికాలోనూ తొలగింపుల వేగం పెరగనుంది. స్థానిక 'వార్న్' చట్టం కింద రాబోయే రోజుల్లో కాలిఫోర్నియాలో లేఆఫ్ నోటీసులు ఇచ్చేందుకు క్వాల్‌కామ్ సిద్ధమవుతున్నట్లు ఇన్వెస్టింగ్.కామ్ నివేదించింది. అక్కడ ఎంతమందిపై ప్రభావం పడుతుందనేది ఇంకా ఖరారు కాలేదు.

కంపెనీ భవిష్యత్ వ్యూహం

ఇటీవలి ఆర్థిక త్రైమాసికంలో క్వాల్‌కామ్ షేరుకు $2.17 ఈపీఎస్ సాధించి విశ్లేషకుల అంచనాలను అందుకుంది. కంపెనీ ఆదాయం $10.44 బిలియన్లుగా నమోదుకాగా, మార్కెట్ అంచనా వేసిన $10.14 బిలియన్లను అధిగమించింది. స్మార్ట్‌ఫోన్ రంగానికి మాత్రమే పరిమితం కాకుండా కృత్రిమ మేధ డేటా సెంటర్లు, ఇతర కొత్త వ్యాపారాల్లోకి క్వాల్‌కామ్ వేగంగా విస్తరిస్తోంది. 2027 ఆర్థిక సంవత్సరం నాటికి స్మార్ట్‌ఫోనేతర వ్యాపారాల నుంచే చిప్ విక్రయాల ఆదాయం అత్యధికంగా వస్తుందని, ప్రస్తుతం కోల్పోతున్న ఆదాయాన్ని ఇవి భర్తీ చేస్తాయని కంపెనీ ధీమాగా ఉంది.



కేదార్‌నాథ్ ఆలయం మూసివేత

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లోని జ్యోతిర్లింగ క్షేత్రం కేదార్‌నాథ్ ఆలయాన్ని ఇవాళ మూసివేశారు. శీతాకాలం ప్రారంభం నేపథ్యంలో ఆలయంలో దర్శనాలు బంద్ చేశారు. ఇవాళ ఉదయం 8.30 నిమిషాలకు వేద మంత్రాల మధ్య ఆలయానికి తాళం వేశారు. ఉత్సవ కేదార్ విగ్రహమూర్తిని అశేష భక్తజనం మధ్య తరలించారు. ఆలయం మూసివేత సందర్భంగా ఉదయం 4 గంటలకే ప్రత్యేక పూజలు ప్రారంభం అయ్యాయి. సంప్రదాయ రీతిలో అన్ని కార్యక్రమాలను నిర్వహించారు. మంగళకరమైన గడియల్లో ఆలయాని తాళం వేశారు. బాబా కేదార విగ్రహమూర్తిని ఊకీమట్‌లోని ఓంకారేశ్వర ఆలయానికి తరలించారు. హరహర మహాదేవ్ అని నినాదాలు చేస్తే వేల సంఖ్యలో బాబా భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ ఏడాది సుమారు 19 లక్షల మంది భక్తులు కేదారీశ్వరుడి దర్శనం చేసుకున్నారు. శీతాకాలం దృష్ట్యా ఆలయాన్ని మూసివేస్తున్న సందర్భంగా మంగళవారం సాయంత్రం కేదార్‌నాథ్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్ర హారతి ముగిసిన తర్వాత .. భారతీయ ఆర్మీ బ్యాండ్ ప్రత్యేక ప్రదర్శన ఇచ్చింది. ఆలయ ప్రధాన పూజారి సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. మళ్లీ వేసవి కాలంలో కేదారీశ్వరుడి ఆలయ



తలుపులు తెరుచుకుంటాయి. ఛార్‌ధామ్ యాత్రలో భాగమైన యమునోత్రి ఆలయాన్ని కూడా ఇవాళ మూసివేశారు.

ఆ బంధానికి అడ్డుగా ఉన్నాడని 24 ఏళ్ల కొడుకును ప్రియుడితో కలిసి చంపిన తల్లి..!

వివాహేతర బంధానికి అడ్డుగా ఉన్నాడని ఓ తల్లి ప్రియుడితో కలిసి కన్నకొడుకునే హత్యచేసింది. కర్ణాటక రాష్ట్రం బెళగావి జిల్లా మాళమారుతి పోలిస్‌స్టేషన్ పరిధిలో నవంబర్ 1న చోటుచేసుకున్న ఈ ఘటనలో తల్లే హంతకురాలిగా తేలింది. దాంతో పోలీసులు మృతుడి తల్లిని, ఆమె ప్రియుడిని, ఈ హత్యకు సహకరించిన ప్రియుడి స్నేహితులను అరెస్ట్ చేశారు. ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. విజయ్ నారాయణ (24) అనే యువకుడు, తన తల్లి మీనా నారాయణ (44) తో కలిసి బెంగళూరులో ఉంటున్నాడు. కొన్నేళ్ల కిందట విజయ్ భర్త చనిపోవడంతో కుమారుడితో కలిసి ఉంటోంది. స్థానికంగా ఓ బ్లూటీ పార్లర్‌లో మేనేజర్‌గా పనిచేస్తోంది. ఆ బ్యూటీ పార్లర్‌లో మహారాష్ట్రలోని గడెహింగ్లజ తాలూకా తేరణి గ్రామానికి చెందిన రాకేశ్ జామూని కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఇద్దరికి పరిచయం ఏర్పడింది.



ఈ పరిచయం కాస్త వివాహేతర బంధానికి దారితీసింది. ఈ బంధం విజయ్ నారాయణ కంటపడటంతో అతడు తల్లిపై ఆగ్రహం వ్యక్తంచేశాడు. తీరు మార్చుకోవాలని మందలించాడు. దాంతో తమ వివాహేతర బంధానికి అడ్డుగా ఉన్న విజయ్ నారాయణను అడ్డు తొలగించుకోవాలని మీనా, ఆమె ప్రియుడు రాకేశ్ నిర్ణయించుకున్నారు. ఆ మేరకు కుట్రపన్నారు. ఈ కుట్రలో భాగంగా మీనా ఊరికి వెళ్దామని తన కుమారుడికి చెప్పింది.

కుమారుడు అంగీకరించడంతో రాకేశ్ కారులోనే తల్లి మీనా, కొడుకు విజయ్ బయలుదేరారు. మార్గమధ్యలో మీనా శీతల పానీయంలో నిద్రమాత్రలు కలిపి విజయ్‌కి ఇచ్చింది. విజయ్ మత్తులోకి జారుకున్న తర్వాత శాలువాతో అతని గొంతుకు ఉరి బిగించి చంపేశారు. బెళగావి వరకు వెళ్లాక మృతదేహాన్ని రోడ్డుపక్కన పడేసిపోయారు. హత్యకు రాకేశ్ స్నేహితులు కూడా సహకరించారని ప్రాథమిక దర్యాప్తులో పోలీసులు గుర్తించారు.

ఆ మేరకు మృతుడి తల్లి మీనా నారాయణ, ఆమె ప్రియుడు రాకేశ్ జామూని, అతని స్నేహితులు సచిన్ కాంబ్లె, మనోజ్ కాంబ్లె, తమ్మణ్ణ కాంబ్లె, ఏకనాథ కాంబ్లెలను అరెస్టు చేశారు.

ఎయిరిండియా విమానం నుంచి హైజాక్ అలర్ట్



ఎయిరిండియాకు చెందిన ఓ విమానం నుంచి హైజాక్ అలర్ట్ రావడం తీవ్ర కలకలం రేపింది. కోల్‌కతా ఎయిర్‌పోర్టు నుంచి ముంబయి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న ఈ విమానం లో బెదిరింపు నోట్ కన్పించింది. విమాన వాష్‌రూమ్‌లో హైజాక్‌ను సూచిస్తూ ఉన్న సందేశాన్ని గుర్తించిన పైలట్ వెంటనే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కు అలర్ట్ ఇచ్చారు. అప్రమత్తమైన ఎయిర్‌పోర్టు సిబ్బంది వెంటనే టేకాఫ్‌ను నిలిపివేసి.. విమానాన్ని ఐసోలేషన్ ప్రాంతానికి తరలించారు. ప్రయాణికులను దించేసి ముమ్మర తనిఖీలు చేపట్టినట్లు కోల్‌కతా ఎయిర్‌పోర్టు డైరెక్టర్ విక్రమ్ సింఘ్ తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఈ విమానం ఉదయం 10.20 గంటలకు ముంబయికి టేకాఫ్ అవ్వాల్సి ఉంది. అయితే, ఆ బెదిరింపు నోట్‌లో ఉదయం 11.10 గంటలకు విమానాన్ని హైజాక్ చేస్తామని రాసి ఉన్నట్లు విక్రమ్ సింగ్ వెల్లడించారు. ఘటనపై పోలీసులు, సెక్యూరిటీ ఏజెన్సీలు దర్యాప్తు చేపట్టాయి. దీనిపై ఎయిరిండియా ఇంకా స్పందించలేదు.

జమ్మూకశ్మీర్‌లో సీఆర్పీఎఫ్ జవాన్లపై ఉగ్రదాడి



జమ్మూకశ్మీర్‌లో మరోసారి ఉగ్రదాడి కలకలం రేపింది. కుల్గాం జిల్లాలోని సీఆర్పీఎఫ్ క్యాంప్‌పై బుధవారం ఉగ్రవాదులు దాడి చేశారు. ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు ఉగ్రవాదులు.. భద్రతా సిబ్బందిపై కాల్పులు జరిపారు. దీంతో సీఆర్పీఎఫ్ జవాన్లు ఎదురుకాల్పులు జరపగా.. ఉగ్రవాదులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనలో ముగ్గురు సీఆర్పీఎఫ్ జవాన్లు గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఉగ్రవాదుల కోసం భద్రతా దళాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. క్విక్ రియాక్షన్ టీమ్‌తో కలిసి క్యాంప్ చుట్టుపక్కల ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ చేపట్టాయి. నిందితులను పాకిస్థానీ ముఠాకు చెందిన ఉగ్రవాదులుగా అనుమానిస్తున్నారు.

అప్పుడు రాహుల్ బర్త్‌డేకు ఎవరూ రాలేదు

రాజకీయాల ప్రభావం తమపైనే కాకుండా తమ పిల్లలపైనా ఉండేదని కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ తెలిపారు. అందుకు సంబంధించిన విషయాలను తన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్'లో గుర్తు చేసుకున్నారు. అప్పటి వరకు తమతో సన్నిహితంగా ఉన్న చాలామంది వ్యక్తులు 1977లో ఇందిరా గాంధీ ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత క్రమంగా తమను దూరం పెట్టడం ప్రారంభించారన్నారు. ఇటువంటి చర్యలు చిన్నారులైన తమ పిల్లలు రాహుల్, ప్రియాంకలను కూడా ఎంతగానో బాధించాయని గుర్తు చేసుకున్నారు.

రాహుల్ నేర్చుకున్న తొలి బాధాకరమైన పాఠం అదే.. "1977లో జరిగిన ఎన్నికల్లో అత్తమ్మ ఇందిరా గాంధీ ఓడిపోయారు. దీంతో ఇంట్లో అందరం బాధ పడ్డాం. అదే సమయంలో రాహుల్ పుట్టిన రోజు కావడంతో ఇంట్లోనే తన స్నేహితులను పిలిచి.. చిన్న పార్టీ చేయడానికి ఏర్పాట్లు చేశాం. కొంతసేపటికి రాహుల్ ప్రాణ స్నేహితుడు సిద్ధార్థ్ ఒక్కడే వచ్చాడు. ఎంతసేపటికీ ఇతరులు ఎవరూ రాలేదు. ఏదో పొరపాటు వల్ల పిల్లలు రాలేదని భావించి, వారి తల్లిదండ్రులకు ఫోన్లు చేశాం. అయితే వారు ఉద్దేశపూర్వకంగానే తమ పిల్లలను మా ఇంటికి పంపనట్లు తెలుసుకొని షాక్ అయ్యాను. ఏడేళ్ల చిన్నారికి స్నేహితులతో ఉన్న బంధం రాజకీయాల వల్ల కలుషితమైపోయిందని తెలిసి బాధ పడ్డాం. ఈ ఘటనతో రాహుల్ తీవ్ర మనస్తాపానికి గురవడంతో అత్తమ్మ, రాజీవ్ ఓదార్చారు. మానవ సంబంధాల విషయంలో అదే రాహుల్ నేర్చుకున్న తొలి బాధాకరమైన పాఠం. అది అంతటితో ఆగలేదు. స్కూల్‌లోనూ అత్తమ్మ, రాజీవ్‌లపై తోటి విద్యార్థులు చేసే వ్యాఖ్యలు విని రాహుల్, ప్రియాంక చాలా బాధ పడేవారు. ఆ సమయంలో వారిని ఓదార్చి.. మన కుటుంబసభ్యులు దేశం కోసం ఎంత శ్రమించారో తెలియజేశా. 1978 నవంబర్‌లో చిక్కమగళూరు ఉప ఎన్నికలో ఇందిరా గాంధీ విజయం సాధించిన తర్వాతే.. పరిస్థితిలో మార్పు వచ్చింది" అని సోనియా వివరించారు.

సంజయ్ మరణం మా కుటుంబానికి తీరని లోటు..

1980 జూన్‌లో పిల్లలకు సెలవులు ఉండడంతో నేను, రాజీవ్, రాహుల్, ప్రియాంకలను తీసుకొని ఇటలీలో ని మా అమ్మగారింటికి వెళ్లాం. పిల్లలను ఓర్వాస్సానోలో ఉన్న నా తల్లిదండ్రుల వద్ద వదిలి మేము ఫ్లోరెన్స్ ప్రాంతానికి వెళ్లాం. జూన్ 23న మా అమ్మకు దిల్లీ నుంచి ఫోన్ వచ్చింది. అవతలి వ్యక్తి ఏం చెబుతున్నారో అర్థం కాకపోవడంతో ఆమె ఫోన్‌ను పదేళ్ల రాహుల్ కు ఇచ్చింది. ఫోన్ చేసిన వ్యక్తి ఇందిరా గాంధీ వ్యక్తిగత కార్యదర్శి ఆర్.కె.ధావన్. విమాన ప్రమాదంలో సంజయ్ చనిపోయాడని ఆయన రాహుల్‌కు చెప్పగానే తాను విన్న విషయాన్ని నమ్మలేకపోయాడు. వెక్కివెక్కి ఏడుస్తూ బాబాయ్ చనిపోయాడు అని రాహుల్ ఇటాలియన్‌లో పదే పదే చెప్పాడు. ఆ వార్త వినగానే రాజీవ్ షాక్‌తో నిశ్చేష్టులయ్యారు. ఆయనను, రాహుల్‌ను ఓదార్చడం ఎవరితరం కాలేదు.

మేము ఇటలీ వెళ్లడానికి ముందే విమానాన్ని నడిపే విషయంలో సంజయ్‌ను రాజీవ్ హెచ్చరించారు. తగిన ప్రాథమిక శిక్షణ లేకుండా విమానాన్ని నడపడంలో తొందరపడవద్దని సూచించారు. అయినప్పటికీ విమానాన్ని నడిపి ప్రమాదానికి గురయ్యారు. సంజయ్ చనిపోయిన సమయానికి ఆయన భార్య మేనకా గాంధీకి 23 ఏళ్లే. అప్పటికి కేవలం మూడు నెలల వయసున్న అతడి కుమారుడు వరుణ్ గాంధీ తండ్రిలేనివాడవ్వడం అందరినీ కలిచివేసింది' అని సోనియా గాంధీ పుస్తకంలో రాసుకొచ్చారు.

ముంబయి లోకల్ రైళ్లలో వేలాడే దృశ్యాలకు ఇకపై చెక్..!

ముంబయిలో లోకల్ రైళ్లలో ప్రయాణం ఎంత కష్టంగా ఉంటుందో తెలిసిందే. అత్యంత రద్దీగా ఉండే ఈ ట్రైన్లకు వేలాడుతూ ప్రయాణిస్తూ ఎందరో ప్రమాదాలకు గురవుతుంటారు. ఇకపై అలాంటి పరిస్థితులకు చెక్ పెట్టేందుకు అధికారులు కీలక చర్యలు చేపట్టారు. మెట్రో తరహాలో లోకల్ రైళ్లకూ ఆటోమేటిక్ డోర్ సిస్టమ్)ను త్వరలో అమల్లోకి తీసుకురావడానికి ప్రణాళికలు రచిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే ఆటోమేటిక్ డోర్లతో తయారు చేసిన తొలి నాన్‌ఏసీ సబర్బన్ లోకల్ రైలు నగరానికి చేరుకున్నట్లు స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. చెన్నైలోని కోచ్ ఫ్యాక్టరీ లో తయారు చేసిన ఈ 12 కోచ్‌ల రైలు ప్రయాణికులకు అందుబాటులోకి రావడానికి ముందు.. పలు భద్రతా పరీక్షలు నిర్వహించనున్నారు. తలుపులు మూసి ఉంచడం వల్ల వెంటిలేషన్ సమస్యలు రాకుండా.. రైలు డిజైన్‌లో పలుమార్పులు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ప్రయాణికులు ఒక కంపార్ట్‌మెంట్ నుంచి మరో కంపార్ట్‌మెంట్‌కు సులభంగా వెళ్లేలా కనెక్షన్‌లు కూడా ఇచ్చారు.

ముంబయి రైల్వే పోలీసుల అధికారిక వెబ్‌సైట్ ప్రకారం.. ప్రతిరోజూ సుమారు 70-80 లక్షల మంది ప్రయాణికులు ముంబయి సబర్బన్ లోకల్ రైలు నెట్‌వర్క్‌ను ఉపయోగిస్తున్నారు. 2025 జూన్ 9న జరిగిన ఓ రైలు ప్రమాదంలో తలుపుల వద్ద నిల్చున్న ఐదుగురు ప్రయాణికులు ప్రాణాలు కోల్పోగా.. పలువురు గాయపడ్డారు. ఆ ఘటన నేపథ్యంలో ముంబయి లోకల్ రైళ్లలో ఆటోమేటిక్ తలుపులు కలిగిన ఎయిర్ కండిషన్డ్ (AC) బోగీలను ఏర్పాటు చేయాలని సీఎం దేవేంద్ర ఫడణవీస్ అధికారులను ఆదేశించించారు. ప్రస్తుతం లోకల్ రైళ్లలోని నాన్ ఏసీ కోచ్‌లకు కూడా ఆటోమేటిక్ డోర్లను ఏర్పాటు చేయడానికి సిద్ధమయ్యారు.



తండ్రికి వాటాగా పంచిన తాత ఆస్తిపై మనవడికి జన్మతఃహక్కు ఉండదు

తాత తన ఆస్తిని పిల్లలకు పంచిన తర్వాత ఆ ఆస్తిపై సర్వహక్కులు వారికే లభిస్తాయని సుప్రీంకోర్టు పేర్కొంది. తండ్రికి అలా లభించిన ఆ ఆస్తిపై మనవడికి జన్మతఃహక్కు ఉండదని జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్, జస్టిస్ సునీతా అగర్వాల్ ధర్మాసనం తీర్పు వెలువరించింది. హిందూ వారసత్వ చట్టం 1956లోని సెక్షన్ 8ని ఉటంకించింది. ఈ చట్టంలోని సెక్షన్ 6, 29(ఎ).. తాత ఆస్తిని కోరుతూ మనవడు దాఖలు చేసిన ప్రస్తుత వ్యాజ్యానికి వర్తించవని స్పష్టం చేసింది. అవిభాజ్య హిందూ కుటుంబ ఆస్తులపై వీలునామా రాయకుండా యజమాని మరణించిన సందర్భాల్లో తలెత్తే వివాదాలు ప్రస్తుత వ్యాజ్యానికి భిన్నమైనవని అభిప్రాయపడింది. పిటిషనర్ కేసులో మద్రాస్ హైకోర్టు వెలువరించిన నిర్ణయంతో ఏకీభవించింది. తన తండ్రి విక్రయించిన ఆ ఆస్తిలో వాటా కావాలంటూ తల్లి సంరక్షణలో ఉన్న మైనర్ కుమారుడు దాఖలు చేసిన పిటిషన్‌ను తోసిపుచ్చింది.

1993లో ఎన్.రామకృష్ణన్(తాత) ఉమ్మడి ఆస్తిని తన పిల్లలకు పంపిణీ చేశారు. అప్పటికి పిటిషనర్ ఇంకా జన్మించలేదు. ఈ ఆస్తిలోని కొంత భూమిని పిటిషనర్ తండ్రి 1997లో విక్రయించారు. ఆయన 2024 వరకూ జీవించి ఉన్నారు. తాత ఆస్తుల పంపిణీ తీరును కానీ, తండ్రి విక్రయాన్ని కానీ పిటిషనర్ సవాల్ చేయకపోవడాన్ని న్యాయస్థానం ప్రస్తావించింది. 1997లో భూమి విక్రయం తర్వాతే వ్యాజ్యం దాఖలైన విషయాన్ని గుర్తు చేస్తూ...తన వాటాలో లభించిన ఆస్తిని విక్రయించే హక్కు పిటిషనర్ తండ్రికి ఉంటుందని తేల్చిచెప్పింది. తాత వాటాలు పంచిన తర్వాత మనవడికి ఆ ఆస్తిపై జన్మతఃహక్కు ఉండదని పేర్కొంది.

తల్లి కళ్లముందే.. మ్యాన్‌హోల్‌లో పడిపోయిన నాలుగేళ్ల చిన్నారి



తల్లితో ఆడుకుంటూ నాలుగేళ్ల బాలుడు ఆమె కళ్లముందే మ్యాన్‌హోల్ లో పడిపోయాడు. దీంతో ఆ తల్లి ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఈ ఘటన దిల్లీ లోని దాస్ గార్డెన్ కాలనీలో చోటుచేసుకుంది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. మంగళవారం సాయంత్రం నాలుగేళ్ల బాలుడు ఇమ్రాన్ ఆడుకోవడానికి తన తల్లితో కలిసి స్థానికంగా ఉన్న పార్క్‌కు వెళ్లాడు. కొద్దిసేపు ఆడుకున్న అనంతరం మూత్ర విసర్జన కోసం మురుగు కాలువ వద్దకు వెళ్లాడు. అక్కడ తెరిచి ఉన్న మ్యాన్‌హోల్‌ను గమనించకపోవడంతో అందులో పడిపోయాడు. వెంటనే స్థానికుల సాయంతో అందులో వెతకడానికి ప్రయత్నించినా.. ఆచూకీ లభించలేదు.

పోలీసులకు సమాచారం ఇవ్వడంతో బాలుడిని రక్షించేందుకు చర్యలు చేపట్టారు. ఎన్డీఆర్ఎఫ్ , దిల్లీ ఫైర్ సర్వీసెస్ , దిల్లీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ , బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ బృందాలు రంగంలోకి దిగి చిన్నారి కోసం తీవ్రంగా గాలిస్తున్నాయి. బాలుడి ఆచూకీ ఇంకా దొరకలేదు.

అస్సాంలో పట్టాలు తప్పిన కోల్‌కతా సైరంగ్ ఎక్స్‌ప్రెస్



కోల్‌కతా సైరంగ్ ఎక్స్‌ప్రెస్ అస్సాంలోని కామ్‌రూప్ జిల్లాలోని డిగార్ రైల్వే స్టేషన్ వద్ద ప్రమాదానికి గురైంది. ప్రయాణికులు ఉన్న ఆరు బోగీలు పట్టాలు తప్పాయి. దీనిపై నార్త్‌ఈస్ట్ ఫ్రాంటియర్ రైల్వే సీపీఆర్వో మాట్లాడుతూ ఈ ఘటన ఉదయం 6.54 సమయంలో చోటుచేసుకొన్నట్లు వెల్లడించారు. ఈ ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. ఇప్పటికే సీనియర్ అధికారులు ఘటనా స్థలానికి బయల్దేరారు. గువాహటికి 30 కిలోమీటర్ల దూరంలో ఈ ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో ఇంజిన్‌తో సహా ఆరు కోచ్‌లు పట్టాలు తప్పాయి. గువాహటి స్టేషన్ నుంచి బయల్దేరిన కొద్దిసేపటికే రైలు ప్రమాదానికి గురైంది. ఈ రైలు మంగళవారం ఉదయం కోల్‌కతా స్టేషన్ నుంచి బయల్దేరింది. ఇది నేటి మధ్యాహ్నానికి మిజోరంలోని సైరంగ్‌కు చేరుకోవాల్సి ఉంది. ఈ రైలు ఒక లైన్ నుంచి మరో లైన్‌కు మారుతున్న వేళ తలెత్తిన సాంకేతిక సమస్య కారణంగా పట్టాలు తప్పి ఉండవచ్చని అనుమానిస్తున్నారు.

మదర్ డెయిరీ, అమూల్ పాలు మరింత ప్రియం.. లీటర్‌పై రూ.6 వరకు పెంపు

న్యూఢిల్లీ: లీటర్ పాల ధరలను పెంచేశారు. మదర్ డెయిరీ, అమూల్ సంస్థలు.. పాల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించాయి. గురువారం నుంచి కొత్తగా ప్రకటించిన పాల ధరలు అమలులోకి రానున్నాయి. లీటరుపై రూ.2 నుంచి రూ.6 వరకు పెరిగినట్లు తెలుస్తోంది. రైతులకు చెల్లించే పాల సేకరణ బిల్లు పెరగడంతో.. డెయిరీ సంస్థలు పాలు. పాల ఉత్పత్తులపై ధరను పెంచేశాయి. ఫుల్ క్రీమ్ మిల్క్‌పై లీటర్‌కు రూ.4 పెంచారు. ఢిల్లీఎన్సీఆర్ ప్రాంతంలో మదర్ డెయిరీ అతిపెద్ద మిల్క్ సరఫరా కంపెనీ. గతంలో మే 14, 2026లో చివరిసారి మదర్ డెయిరీ తన పాల ధరలను పెంచింది. ఏప్రిల్ 2025లో కూడా ఓసారి పెంచారు.

పాల సేకరణ ఖర్చులు పెరగడం వల్ల ఆ ప్రాక్యూర్‌మెంట్ ఛార్జీలను కస్టమర్లను వసూల్ చేసే క్రమంలో పాల ధరను పెంచినట్లు తెలుస్తోంది. ఫుల్ క్రీమ్ మిల్క్ లీటరుకు 72 నుంచి 76కు పెరిగింది. టోన్డ్ మిల్క్ 58 నుంచి 60కి పెంచారు. టోన్డ్ మిల్క్(ప్రొచ్డ్) 62కు పెంచారు. డబుల్ టోన్డ్ మిల్క్‌ను లీటరుకు 56 చేశారు. ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో మదర్ డెయిరీ సుమారు 35 లక్షల లీటర్ల పాలు ప్రతి రోజూ సరఫరా చేస్తోంది.



అసమాన సారథ్యం అమేయ దార్శనికత

డీఆర్‌డీఎల్-డీఆర్‌డీవోలో చేరగానే, అప్పటి డైరెక్టర్ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం దగ్గరికి వెళ్లి విధి నిర్వహణ ప్రారంభించాను. డీఆర్‌డీఎల్‌లో ప్రతిరోజూ ఉదయం జరిగే సమావేశాల్లో మా బృందం సాంకేతిక, నిర్వహణాపరమైన సవాళ్లను చర్చించేది. అప్పుడే ఆయన ఏవియానిక్స్ శాస్త్రంపై ఒక పుస్తకాన్ని నాచేతికిచ్చి, చదివి రమ్మన్నారు. ఆ తర్వాత ఆ పుస్తకంపై నా అభిప్రాయాన్ని తెలుసుకుని, నా అవగాహనను అంచనా వేశారు. క్షిపణులకు స్వదేశీ నావిగేషన్ వ్యవస్థలను రూపొందించుకోవడం ఎంత ముఖ్యమో వివరించి, నన్ను నావిగేషన్ బృందానికి కేటాయించారు. కలాం నిర్ణయం నా జీవన పథాన్ని మార్చేసింది. ఆ ఒక్క భేటీలోనే ఆయన నిరాడంబరతను, శ్రద్ధగా ఆలకించే లక్షణాన్ని, యువ శాస్త్రవేత్తల్లోని ప్రతిభను గుర్తించి మార్గనిర్దేశం చేసే గుణాన్ని ప్రత్యక్షంగా చూశాను.

నావిగేషన్ గ్రూప్‌లో కలాం లక్ష్యం 'హద్దులను ఛేదించి అధునాతన సాంకేతికతను అభివృద్ధి చేసుకోవడం'. అందుకోసం ఆయన ముందుగా యువ శాస్త్రవేత్తలను కలిసి, జరుగుతున్న పనిపై వారి అభిప్రాయాలను తెలుసుకుని, ఆ తర్వాతే వారి విభాగాల అధిపతులతో చర్చించేవారు. చిన్నాపెద్దా హోదాతో సంబంధం లేకుండా అందరి అభిప్రాయాలనూ స్వీకరించేవారు. స్వదేశీ నావిగేషన్ వ్యవస్థలను అభివృద్ధి చేసే రోజుల్లో, మేము వైబ్రేషన్ (ప్రకంపన) సంబంధిత సమస్యలను ఎదుర్కొని ఎన్విరాన్‌మెంటల్ టెస్ట్ ఫెసిలిటీలో చాలా రాత్రులు గడిపాము. ఆయన అర్ధరాత్రి వేళ సాధారణ దుస్తులలో వచ్చి, మాతోపాటు గంటల తరబడి గడుపుతూ నిరాడంబరతకు, నాయకత్వానికి నిలువెత్తు రూపంగా నిలిచేవారు. 1988 చివరిలో అగ్నిక్షిపణి అభివృద్ధి సమయంలో తీవ్రమైన సాంకేతిక సమస్యలు ఎదురై, అసలు మొత్తం నావిగేషన్ వ్యవస్థనే మార్చాలా అని చర్చలు జరిగేవి. ఆ రోజుల్లో కలాం మాతోనే చాలాసేపు ఉండి, సమస్యలపై నేరుగా చర్చించేవారు. చివరికి నావిగేషన్ వ్యవస్థను పూర్తిగా మార్చాల్సిన అవసరం లేకుండానే సమస్యను పరిష్కరించడానికి మా బృందానికి సాయపడ్డారు. పని పూర్తయ్యాక వచ్చిన ప్రశంసలు నాలాంటి యువ శాస్త్రవేత్తకు ఎంతో స్థైర్యాన్నీ, ఉత్సాహాన్నీ ఇచ్చాయి.

అనుక్షణం తోడుగా...

శ్రీహరికోటలో 1988లో జరిగిన పృథ్వి ప్రయోగం నాకు మొట్టమొదటి పెద్ద ప్రాజెక్ట్. సాంకేతిక సమస్యల వల్ల మా బృందం తీవ్ర ఒత్తిడిలో ఉంది. ఒక రోజు రాత్రి దాదాపు 11 గంటలకు ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.జె.సుందరం, డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.కె.సరస్వత్, ఇతరులను కలాం తన గదికి పిలిచారు. సాధారణ అంశాలు, తాత్విక విషయాలు, రామేశ్వరం గురించి, ఆలయంలో పాడవైన ప్రాకారాలలో ఒంటరిగా ఉండే ఒక వ్యక్తి ఫొటో గురించి మాట్లాడారు. ఈ విశాల విశ్వంలో ఆ వ్యక్తి స్థానం, పాత్ర గురించి ఆలోచింపజేశారు. మా మనసుల నుంచి ఒత్తిడి నెమ్మదిగా దూరమైంది. ఆ ప్రశాంత స్థితిలో సమస్య తక్షణమే పరిష్కారమైంది. ఇదే ఆయన పద్ధతి: మానసిక ప్రశాంతతను పునరుద్ధరించడం ద్వారా క్లిష్ట పరిస్థితుల నుంచి సిబ్బందిని ముందుకు నడిపించడం, వైఫల్యానికి ఎప్పుడూ భయపడకపోవడం, నేర్చుకుంటారంటే వైఫల్యాలను కూడా ప్రోత్సహించడం- కలాం విలక్షణ శైలి.

మొదటి అగ్నిప్రయోగం సమయంలో లాంచ్‌ప్యాడ్ దగ్గర బృందాలు 72 గంటలపాటు నిర్విరామంగా పనిచేశాయి; ఆయన అంతసేపూ అక్కడే మాతోపాటే ఉన్నారు. ఆయన నిష్ఠ తిరుగులేనిది. రెండు ప్రయత్నాల తర్వాత క్షిపణి ప్రయోగం విఫలమైనప్పుడు మాత్రమే కలాంలో ఒత్తిడి చూశాను. మూడో ప్రయత్నం విజయవంతమవడంతో ఆయనకు ఎంతో ఉపశమనం లభించింది. చాందీపూర్ లాంచ్ రేంజ్ పూర్తిగా సిద్ధం కాకముందే అక్కడి నుంచి క్షిపణి ప్రయోగాలు మొదలుపెట్టాలని సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. ఇస్రో నిపుణులు, డీఆర్‌డీవో బృందాలతో కలిసి దాన్ని సాకారం చేశారు.

అదే నిజమైన నివాళి...

రక్షణ మంత్రికి శాస్త్రీయ సలహాదారు అయిన తర్వాత కూడా కలాం ప్రతి శుక్రవారం దిల్లీ నుంచి హైదరాబాద్ వచ్చి రాత్రి 9:30 తర్వాత సమీక్షలు నిర్వహించేవారు. ఆయన స్థాపించిన రీసెర్చ్ సెంటర్ ఇమారత్(ఆర్‌సీఐ)ని అప్పటి భారత రాష్ట్రపతి ప్రారంభించారు. అది స్వదేశీ ఏవియానిక్స్, నావిగేషన్ వ్యవస్థల రూపకల్పన కేంద్రమైంది. నేను దానికి డైరెక్టర్ అయినప్పుడు, 'నువ్వు చేసిన పనిని బట్టి ప్రజలు నిన్ను గుర్తుంచుకోవాలి' అని కలాం సలహా ఇచ్చారు. నేను శాస్త్రీయ సలహాదారుగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత, 2015 జులై 6న ఆయనతో చివరిసారి సమావేశమయ్యాను. నాయకత్వం, విధులు, బాధ్యతలపై తన అనుభవాలను, పాఠాలను కలాం నాతో పంచుకున్నారు. ఆ రోజు ఆయన ఆలోచనలలో ప్రధానమైనవి: పునర్వినియోగ క్షిపణి అభివృద్ధి, స్వయంసమృద్ధి కోసం నిరంతర సాధన. ఆ వయసులో కూడా ఆయన చురుగ్గా, ఉత్సాహంగా భవిష్యత్తు ప్రణాళికలపై మాట్లాడారు. ఆపైన కొన్ని వారాలకు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఆయన కన్నుమూశారు.

సాంకేతికతలో భారత్‌ను అగ్రగామిగా నిలపాలని కలాం నిరంతరం తపించారు. హైపర్ సోనిక్స్, అధునాతన మెటీరియల్స్ తయారీ, విస్తృత స్వయంసమృద్ధి సాధన దిశగా ఈరోజు మనం సాగిస్తున్న ప్రయాణంలో కలాం దారిదీపంగా నిలుస్తున్నారు. రామేశ్వరంలో ఆయనకు డీఆర్‌డీవో నిర్మించిన స్మారక చిహ్నానికి రూపకల్పన చేసే భాగ్యం నాకు లభించింది. అక్కడ కలాం జ్ఞాపకాలను పదిలపరిచారు. అయితే, కలాంకు అతిపెద్ద నివాళి- ఆయన స్వప్నించిన స్వయంసమృద్ధిని, సాంకేతికంగా ఉన్నతమైన భారతదేశాన్ని సాధించడమే.



శాశ్వత తాగునీటి పథకమేదీ?

ప్రపంచం నలుమూలల నుంచి యాత్రికులు తిరుమల–తిరుపతికి వస్తుంటారు. దక్షిణాది రాష్ట్రాల సమావేశాలను కేంద్ర ప్రభుత్వం తిరుపతిలోనే నిర్వహిస్తుంది. జాతీయ, అంతర్జాతీయ సెమినార్లు తిరుపతిలో జరుగుతాయి. ఇంతటి ప్రాచుర్యం గల పట్టణానికి శాశ్వత తాగునీటి వసతి లేదు. తిరుపతిలో దాదాపు లక్ష ఇళ్లకు తాగునీరు సరఫరా చేయాలి. తిరుమలకు ప్రతిరోజూ లక్ష మంది వరకూ యాత్రికులు వస్తుంటారు. తిరుమల, తిరుపతిలలో ప్రతి యాత్రికుడు కనీసం మూడు రోజులు గడుపుతాడు. ఇక తిరుపతి కార్పొరేషన్‌ను విస్తరిస్తే పలు గ్రామాల తాగునీటి బాధ్యత మున్సిపల్ కార్పొరేషన్‌పై పడుతుంది. నిన్న మొన్నటి వరకు ఇది స్మార్ట్ సిటీ జాబితాలో ఉంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం ఈ పట్టణాన్ని 'ప్రగతి' పథకం కింద ఎంపిక చేసింది. ఈ నేపథ్యంలో తిరుమల తిరుపతికి శాశ్వత ప్రాతిపదికన తాగునీటి వసతి ఉండి తీరాలి. గమనార్హమైన అంశమేమంటే తిరుమలలో ఉండే మినీ జలాశయాలను మినహాయిస్తే తిరుమల తిరుపతి దాహార్తిని తీర్చే ప్రధానమైన వనరు కల్యాణి డ్యామ్. దీని నీటి నిల్వ సామర్థ్యం 0.910 టీఎంసీలైతే, వర్షా భావంతో ఈ ఏడాది అక్టోబరు 5 నాటికి అందులో కేవలం 0.204 టీఎంసీల నీరు మాత్రమే ఉంది.



దురదృష్టం కొద్దీ వర్షాభావంతో పాటు ఎల్‌నినో కూడా వచ్చే సంవత్సరం వరకూ కొనసాగితే తిరుమల తిరుపతి పుణ్యక్షేత్రం పరిస్థితి ఏమిటి? కేవలం కండలేరు జలాశయంపై ఆధారపడాలి. అందులోనూ 68 టీఎంసీలకు ప్రస్తుతం 17 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. క్రమంగా డెడ్ స్టోరేజ్‌కి చేరుతోంది. తిరుమల తిరుపతి శాశ్వత తాగునీటి పథకంపై ఇంజినీరింగ్ అధికారులు గానీ, స్థానిక ప్రజాప్రతినిధులు గానీ, టీటీడీ బోర్డు గానీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సమగ్రంగా వివరించినట్లు లేదు. ప్రజాప్రతినిధులు తమ అవసరాల రీత్యా అనేక ప్రతిపాదనలు చేస్తుంటారు. కానీ వాటి సాధ్యాసాధ్యాలు, సాంకేతిక ఇబ్బందులను ఇంజినీరింగ్ అధికారులు ముఖ్యమంత్రికి సవివరంగా నివేదించాలి. ప్రధానంగా ఇంజినీర్ ఇన్ చీఫ్ జాగరూకత వహించాలి.

2025 జూన్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తిరుపతి పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా గాలేరు-నగరి రెండో దశలో భాగంగా బాలాజీ రిజర్వాయర్ ద్వారా తిరుమల తిరుపతి ప్రజల దాహార్తిని తీరుస్తామని ప్రకటించారు. అంతేకాదు, ఏర్పేడు సమీపంలో గల మేర్లపాక చెరువు నుంచి కండలేరు జలాలను ఎత్తిపోతల ద్వారా బాలాజీ రిజర్వాయర్‌లో నింపుతామని ప్రకటించారు.

సంక్రాంతి సందర్భంగా నారావారిపల్లెలో చంద్రబాబు మకాం చేసినప్పుడు కూడా హంద్రీ-నీవా ఫేజ్-2లో భాగమైన నీవా కాలువ నుంచి రూపొందించిన పథకం ద్వారా కృష్ణా జలాలను కల్యాణి జలాశయంలో నింపుతామని ప్రకటించి, పునాది రాయి వేశారు. ఇటీవల టెండర్లు కూడా పిలిచారు. ఇదిలా ఉండగా ఈ మధ్య మదనపల్లిలో జరిగిన రాయలసీమ రైజింగ్ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, బాలాజీ రిజర్వాయర్ నిర్మాణం జరుగుతుందని ప్రకటించారు. అసలు తిరుమల తిరుపతి తాగునీటికి ఏ పథకం ఉద్దేశించారు? వాస్తవంలో, జిల్లాల్లో ముఖ్యమంత్రి పర్యటించే సమయంలో ఆయా శాఖాధికారులు స్థానిక అంశాలపై ఫీడింగ్ ఇస్తారు. అలా అధికారులు ఇచ్చిన సమాచారం ఆధారంగా ఆయా కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు.

రాష్ట్ర ప్రభుత్వం తిరుమల తిరుపతి తాగునీటి అవసరాలకు రెండు రిజర్వాయర్లను అమలులోకి తెచ్చే విధానపరమైన నిర్ణయం తీసుకున్నదా? అదే నిజమైతే ముఖ్యమంత్రి విధిగా ప్రకటించేవారు. అంతేకాదు, హంద్రీ-నీవా నీళ్లు కల్యాణి డ్యామ్‌కు రావాలంటే ఏడెనిమిది ఎత్తిపోతల ద్వారా, రమారమి 700 కిలోమీటర్ల దూరం నుంచి రావాలి. బహుశా ఆంధ్రప్రదేశ్‌లోనే ఏ పట్టణానికీ ఇలాంటి తరహాలో తాగునీటి పథకం అమలు జరగలేదేమో. ఇంజినీరింగ్ అధికారులు ముఖ్యమంత్రికి సాంకేతిక సంబంధమైన చిక్కులను వివరించి ఉంటే ఆయన అంగీకరించేవారు కాదేమో. ఒకవేళ ఇంతకు మించి వేరే అవకాశం లేదా పథకం లేకపోతే తప్పనిసరిగా దీన్నే అంగీకరించాలి. మరోవైపు 300 కిలోమీటర్ల దూరంలో, పూర్తి గ్రావిటీతో బాలాజీ రిజర్వాయర్ గురించి ముఖ్యమంత్రి పలుమార్లు ప్రకటించి ఉన్నారు. ఇంత గందరగోళం జరుగుతూ ఉంటే తిరుపతి ఎమ్మెల్యేతో పాటు మేయర్ పదవి కోసం ప్రయత్నిస్తున్న నేతలు నిమ్మకు నీరెత్తినట్లు ఉండటమే విషాదం. గాలేరు-నగరి సుజల స్రవంతి పట్టాలెక్కిన 2006లో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన రెండో దశకు 10 టీఎంసీల నీటి కేటాయింపులు జరిగాయి. ప్రతిపాదించిన ఏడు రిజర్వాయర్లలో మూడు టీఎంసీల సామర్థ్యంతో బాలాజీ రిజర్వాయర్ కూడా ఉంది. ఇందులో ఒక టీఎంసీ నీళ్లు తిరుమల తిరుపతి శాశ్వత తాగునీటికి ఉద్దేశించారు. అప్పట్లో టెండర్లు పూర్తయినా తట్టెడు మట్టి కూడా పడలేదు.

రాష్ట్ర విభజనానంతరం చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన తర్వాత కొంత కదలిక వచ్చింది. పాత కాంట్రాక్టర్ల స్థానంలో కొత్తవారు వచ్చారు. 250 కోట్ల వ్యయంతో ఉన్న బాలాజీ రిజర్వాయర్ నిర్మాణం ప్రస్తుతం ఎటూకాకుండా ఉంది. దాదాపు 50 కోట్ల రూపాయల పనులు జరిగాయి. ఫస్ట్ ఫేజ్‌కు అటవీ శాఖ అనుమతి కూడా లభించింది. అయితే 2019లో జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఒక్క జీవోతో రాష్ట్రంలోని 350 టెండర్లు రద్దు చేశారు. ఇందులో ఆయన తండ్రి వై.ఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జరిగిన టెండర్లు కూడా ఉన్నాయి.

ఇలా రద్దయిన టెండర్లలో నిర్మాణంలో ఉన్న బాలాజీ రిజర్వాయర్‌తో పాటు గాలేరు-నగరి రెండో దశకు చెందిన అన్ని టెండర్లూ ఉన్నాయి. ఇన్నిసంవత్సరాలు గడచినా యథాస్థితే కొనసాగుతోంది. ఇటీవల ప్రతిపాదనకు వచ్చిన హంద్రీ-నీవా పథకానికి టెండర్లు పిలిచారు. ఏళ్ల తరబడి నానుతూ ఉన్న బాలాజీ రిజర్వాయర్ మాత్రం ముఖ్యమంత్రి ప్రకటనలకు, కాగితాలకే పరిమితమైంది. గాలేరు-నగరి పథకంలో... కడప జిల్లాలోని గండికోట జలాశయం 26 టీఎంసీల సామర్థ్యంతో నిర్మితమైంది. ఇక్కడ ఎప్పుడూ నీళ్లు ఉంటున్నాయి. నీటి ఎద్దడి రోజుల్లో కూడా 300 కి.మీ. లోపు దూరం నుంచి బేషుగ్గా గ్రావిటీతో బాలాజీ రిజర్వాయర్‌కు నీళ్లు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి అనేకసార్లు బాలాజీ రిజర్వాయర్ గురించి చెబుతున్నారు. వచ్చిన చిక్కేమిటంటే స్థానికంగా పట్టించుకునేవారు లేరు. కూటమికి చెందిన మూడు పార్టీల నేతలు కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తెచ్చి ఈ గందరగోళానికి తెర దింపేందుకు సిద్ధంగా లేరు!

ఉత్సవం కాదు ఉద్యమం

పదహారవ ఏటకు చేరిన బహుజన బతుకమ్మ ఈ ఏడాది దాశరథి స్వగ్రామమైన మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు నుంచి ప్రారంభం కావాల్సి ఉంది. కానీ వర్షా భావం వల్ల గూడూరు చెరువు నిండలేదు. అందుకే బహుజన బతుకమ్మను ఒక పంటల పండుగగా జరుపుకోవాలని ఎల్లంపేటకు మార్చాల్సి వచ్చింది. అమెరికా–భారత్ మధ్య అసమాన వాణిజ్య ఒప్పందాలతో మన దేశ మార్కెట్లోకి ప్రవాహం లాగా వచ్చి పడుతున్న పాల ఉత్పత్తులు, చీజ్, సోయాబీన్.. మన రైతుల వెన్నెముక విరవనున్నాయి. అందుకే రైతాంగంతో భుజం కలుపుతూ ఆహార స్వావలంబన కోసం తెలంగాణ నవధాన్యాల సంస్కృతిని పునరుద్ధరించడమే సరైన ప్రత్యామ్నాయం అవుతుంది. తెలంగాణలోని వైవిధ్య పంటలు, చిన్న చిన్న కమతాలు, బహుజన సమూహాలు చిన్ననీటి వనరులను ఎత్తిపడితేనే కార్పొరేటీకరణను ప్రతిఘటించగలుగుతాం. ఇందుకోసం శ్రమజీవులైన దళిత బహుజనులను ఐక్యం చేయడానికి ఆటంకంగా ఉన్న సాంస్కృతిక సామాజిక అసమానతలపై బహుజన బతుకమ్మ పోరాడుతున్నది. బతుకమ్మకు ఎవరూ అంటరానివారు కాదని చెబుతూ దళితవాడలోంచి బయలుదేరుతున్నది. 'దళితులను ఐక్యం చేయండి–దళితులతో ఐక్యంకండి' అనే ఒక విప్లవ నినాదాన్ని ఊరూవాడల ఐక్యతగా అభివర్ణిస్తూ ఆచరిస్తున్నది. బతుకమ్మ ఒక పంటల పండుగ. బహుజన బతుకమ్మ ఒక సాంస్కృతిక ఉద్యమం అని చెబుతున్నాం.



బతుకమ్మ పంటల పండుగ అని చెప్పడం... గతించిన పెద్దలకు పితరుల అమావాస్య (పెత్తరామాస) నాడు కొత్త పంట బియ్యం సమర్పించడంతో మొదలవుతుంది. కుటుంబ పెద్దలకు ఇష్టమైన ఆహారాన్ని వండి, వారికి నైవేద్యంగా సమర్పించి దానిని బతికున్న ఇంటి పెద్ద ఆరగించడంతో ఎంగిలిపూల బతుకమ్మ ప్రారంభమవుతుంది. ఆ విధంగా ఎంగిలిపూల బతుకమ్మలకు ముందు బాలికలు తొమ్మిది రోజులు ఆడుకునే మట్టి బొడ్డెమ్మలు కేరళంలో జరిగే ఓనం పండుగ అలంకరణలతో పోలి ఉంటాయి. భూమిలోకి తొక్కేసిన బలి చక్రవర్తిని కేరళం ప్రజలు ఆ భూమిలో నుంచి తీసుకున్న మట్టిబొడ్డెమ్మలుగా (అవన్నీ అమరుల స్తూపాకారాల్లా ఉంటాయి) అలంకరించి అయిదు రోజులకు నీళ్లలో నిమజ్జనం చేస్తారు. మట్టి బొడ్డెమ్మ, పూల బతుకమ్మ, నీళ్లు, సద్దులు... ఇవన్నీ వ్యవసాయ నాగరికతకు సంబంధించిన అనవాళ్లే. వీటికి తోడు బోనాలు. ఇవన్నీ స్త్రీల ఆధారిత పండుగలుగా ఎందుకున్నాయి? స్త్రీల పునరుత్పత్తికి-వ్యవసాయోత్పత్తికి ఉన్న సంబంధం ఏమిటి? స్త్రీల పునరుత్పత్తి మాత్రమే కొనసాగిన మాతృస్వామిక సమాజం తర్వాత మొదలైన తొలి సమాజమే వ్యవసాయోత్పత్తితో ప్రారంభమైంది. అది పారిశ్రామికోత్పత్తిగా మారి, కృత్రిమ మేధ (ఏఐ) రంగంగా మారినా, మనిషి ఆహారాన్ని తినడం మానలేదు. ఆహారంగా అందివచ్చిన పంటలకు పండుగను చేయడం ఆగలేదు.

పంటల పండుగలో ఆ పంటలకు మూలమైన శ్రమజీవుల్లో కొందరిని అంటరానివారిగా చూసే దురాచారాలు ఇప్పటికీ ఉన్నాయి. వాటిని మార్చాలి. దొరల గడీల ముందు ఆడే కాలం నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ పతాకగా ఎగరేసి విజయం సాధించేదాకా బతుకమ్మలతో ఎన్నో అనుభవాలున్నాయి. స్వరాష్ట్రంలో దీనిని రాష్ట్ర పండుగగా, తంగేడు పువ్వును రాష్ట్ర పుష్పంగా ప్రకటించే వరకు ఎన్నో పరిణామాలున్నాయి. పితృస్వామ్యాన్ని ప్రశ్నించడం, సామాజిక న్యాయాన్ని సాధించడం, ఆచారాలను ప్రజాస్వామీకరించడం, ఆహార స్వావలంబన కోసం నవధాన్య సంస్కృతిని ఎత్తిపట్టడం, సామ్రాజ్యవాద జోక్యాన్ని ఎదిరించడం, పర్యావరణాన్ని రక్షించడం వంటి అనేక అంశాలను బహుజన బతుకమ్మ గత పదిహేనేళ్లుగా లేవనెత్తుతోంది. భారతదేశపు విశిష్ట దోపిడీ రూపంగా ఉన్న కుల వ్యవస్థతో బహుజన బతుకమ్మ దాదాపు తల పడుతున్నది.

పదహారేళ్లుగా 250కు పైగా కేంద్రాల్లో మేం చేస్తున్న పోరాటం ఇప్పటికీ ఒక ప్రజా ఉద్యమ రూపం తీసుకోలేదు. ఈ పోరాటాన్ని విస్తృతపరచడానికి ప్రతి గ్రామానికొక కార్యకర్త అవసరం. అలాగే దీని కొనసాగింపుగా అందుకోవడానికి రైతు-కూలీ రంగం, స్త్రీ విముక్తి రంగం, కుల నిర్మూలనా రంగం, ప్రత్యేకించి జెన్ జీ తరం ముందుకు రావడం కూడా అవసరం. గ్రామీణ స్వయం సమృద్ధి అనే అంశాన్ని లేవనెత్తుతూ ఈ దఫా భూముల పంపకం-నీటి పెంపకం-పర్యావరణ పరిరక్షణ లాంటి అంశాలను లేవనెత్తుతున్నాం. ఆదివాసులు డిమాండ్ చేస్తున్నట్టు నాగరిక సమాజం కూడా జల్-జంగల్-జమీన్ లాంటి అంశాలను, ఆహార స్వావలంబనను లేవనెత్తాలి. సాంస్కృతిక రంగంలో జరిగే కుల, వర్గ పోరాటాలను సమాజంలో జరిగే కుల, వర్గ పోరాటాలతో అనుసంధానం చేసే దిశగా ఆలోచనాపరులు ముందడుగు వేయాలి.

తెలంగాణ బతుకమ్మ 'సద్దుల్లో' నవధాన్యాలున్నట్లే, కేరళం ఓనం 'సద్య'లో కొబ్బరి వంటకాలుంటాయి. అయితే ఓనం కుల-మతాలకతీతంగా లౌకిక పండుగగా జరుపుకుంటారు. విశ్వవ్యాప్తమైన బతుకమ్మను లౌకిక పండుగగా తీర్చిదిద్దుకోవాల్సిన సమయంలో, బతుకమ్మను నిలువెత్తు దేవతగా చిత్రించి, మరింత మతమయం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఏకత్వంలో భిన్నత్వంగా, గంగా-జమునా తహజీబ్‌గా ప్రసిద్ధిగాంచిన తెలంగాణ సమాజం వివేకంతో అడుగులేయాల్సిన సందర్భం ఇది. బహుజన బతుకమ్మ కేవలం ఉత్సవం మాత్రమే కాదు-ఉద్యమం కూడా.

సామాన్యుల నెత్తిన ధరల బరువు!

ఆదాయాల కంటే వేగంగా ధరలు పెరుగుతుంటే, అసలే అరకొర సంపాదనతో బతుకుబండిని భారంగా లాక్కొచ్చే ప్రజల కొనుగోలు శక్తి ఇంకా తగ్గిపోతుంది. అది పోషకాహార భద్రతను, జీవన నాణ్యతను దెబ్బతీసి జనసామాన్యాన్ని దుర్బలం చేస్తుంది. ధరాఘాతాల దెబ్బకు వినియోగం క్షీణించేకొద్దీ ఉత్పాదకత, ఉపాధి, ఆర్థిక వృద్ధి తదితరాలపైనా ప్రతికూల ప్రభావం పడుతుంది. వస్తుసేవల కోసం దేశీయ ప్రజానీకం వెచ్చిస్తున్న మొత్తం సొమ్ము వాటా భారత జీడీపీలో 61శాతానికి పైబడిన సంగతిని స్మరణలో ఉంచుకుంటే ధరల మోత మూలంగా వినియోగం తగ్గితే మన ఆర్థిక వ్యవస్థకు ఎంతటి నష్టం వాటిల్లుతుందో అర్థం చేసుకోవచ్చు. అస్తవ్యస్త వాతావరణ పరిస్థితులు, అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, సరఫరా గొలుసుల్లో అవాంతరాల వల్ల ఆహార, ఇంధన ధరలు మండిపోతున్నాయి. అవి పొదుపు మొత్తాలను మింగేస్తూ, నిరుద్యోగానికి అంటుకట్టే ద్రవ్యోల్బణానికి కొత్త రెక్కలను మొలిపిస్తున్నాయి. దేశీయంగా గడచిన రెండేళ్లలో గరిష్ఠ స్థాయిలో కిందటి నెలలో ద్రవ్యోల్బణం 5.54శాతానికి చేరింది. వడ్డీరేట్ల పెంపు వంటివాటితో ద్రవ్యోల్బణానికి పూర్తిగా పగ్గాలు బిగించడం కుదరని నేపథ్యంలో సామాన్యులకు సాంత్వన కలిగించేందుకు ప్రభుత్వాల క్రియాశీలక జోక్యం ఇప్పుడు అనివార్యమవుతోంది!

పశ్చిమాసియా ఘర్షణలతో భారత ముడిచమురు దిగుమతుల బిల్లు తడిసిమోపెడవుతోంది. నిరుడు ఏప్రిల్-ఆగస్టు మధ్యలో 5040కోట్ల డాలర్లుగా నమోదైన ఆ వ్యయం ఈ ఏడాదిలో అదే అయిదు నెలల్లో 7480కోట్ల డాలర్లకు పెరిగిపోయింది. అంతర్జాతీయ ఇంధన మార్కెట్లలో ఒడుదొడుకుల కారణంగా తయారీ, రవాణా ఖర్చులు ఎక్కువవుతున్నాయి. వస్తూత్పత్తుల ధరలను అవి ప్రభావితం చేస్తున్నాయి.



దేశీయంగా డెబ్భైశాతానికి పైగా సరకు రవాణా రహదారుల ద్వారానే జరుగుతోంది. అందుకయ్యే ఖర్చులో దాదాపు 42శాతం ఇంధనానికే చెల్లిపోతుంది. దానిరిటెయిల్ ధరల్లో పెరుగుదల కారణంగా ఆహార ఉత్పత్తులు, వినియోగ వస్తువులు బాగా ఖరీదు కావొచ్చని క్రిసిల్ నివేదిక కొన్ని నెలల క్రితమే హెచ్చరించింది. చమురు వెల లీటర్‌కు పది రూపాయలు అధికమైతే వినియోగదారుల ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం 48 బేసిస్ పాయింట్ల మేర ఎగసిపడుతుందని అది లెక్కగట్టింది. పెట్రోల్, డీజిల్‌లపై పన్నులను పరిమితం చేసి లాజిస్టిక్స్ వ్యయాన్ని తగ్గించడంపై ప్రభుత్వాలు దృష్టిపెడితేనే ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల నుంచి ప్రజలకు కాస్త ఉపశమనం లభిస్తుంది.

ఆహార ధాన్యాలు రికార్డు స్థాయిలో ఉత్పత్తి అవుతుండటం, ప్రభుత్వం దగ్గర నిల్వలు గణనీయంగా ఉండటంతో సంవత్సర కాలంగా వాటి ధరలు దాదాపు స్థిరంగా ఉన్నాయని సర్కారీ వర్గాలు ఇటీవల సెలవిచ్చాయి. కానీ, బియ్యం సహా పలు నిత్యావసరాల ధరలు భగ్గున మండుతున్నాయి. కూరగాయలూ పండ్ల వెలలూ నింగిని తాకుతున్నాయి. ఎల్‌నినో వల్ల ఆహార ద్రవ్యోల్బణం మరింతగా కట్టలు తెంచుకునే ముప్పుంది. వాతావరణ మార్పులతో వ్యవసాయ సంక్షోభం తీవ్రమవుతున్నప్పటికీ ద్రవ్యోల్బణానికి అదొక్కటే కారణం కాదు. దేశవ్యాప్తంగా సుమారు ఇరవై పంటలనే ఎక్కువగా పండిస్తుండటం, వాటిలోనూ కొన్ని రకాలు అతికొద్ది రాష్ట్రాల్లోనే అధికంగా సాగవుతుండటం సమస్యాత్మకమవుతోంది. వంటనూనెలు, పప్పుధాన్యాలకు దిగుమతులపై ఆధారపడాల్సి రావడమూ ఇబ్బందికర పరిస్థితులను సృష్టిస్తోంది. జాతీయస్థాయి సేద్య ప్రణాళికతో సాగురంగాన్ని పటిష్ఠం చేయడం, నిల్వ వసతులను పెంచి పంట ఉత్పత్తుల వృథాను అరికట్టడంపై ప్రభుత్వాలు శ్రద్ధ వహిస్తేనే దేశానికి దీర్ఘకాలంలో లబ్ధి కలుగుతుంది. నేటి అనిశ్చిత ఆర్థిక వాతావరణంలో అనవసర ఖర్చులు, అప్పులకు దూరంగా ఉండటం ప్రజానీకానికి మేలు చేస్తుంది!

పరిటాల శ్రీరామ్‌కే జెడ్పీ పీఠం





- ఇదే జిల్లా శ్రేణుల ఆకాంక్ష...!
- తండ్రి చూపిన ప్రజా పోరాట బాట....
- తల్లి అందించిన రాజకీయ మార్గదర్శకత్వం....
- పార్టీ కోసం అలుపెరగని కృషి....
- ఇప్పుడు జిల్లా నాయకత్వ బాధ్యతలపై అందరి చూపు!

ధర్మవరం నవంబర్ 11 అనంత జనశక్తి న్యూస్ :

రాజకీయ చరిత్రలో కొన్ని కుటుంబాలకు ప్రత్యేక స్థానం ఉంటుంది. ఆ స్థానం కేవలం అధికారంతోనో, పదవులతోనో ఏర్పడదు. ప్రజల మధ్య సాగించిన ప్రయాణం, కష్టకాలంలో అండగా నిలిచిన తీరు, కార్యకర్తలతో ఏర్పరచుకున్న అనుబంధం, ప్రజా సమస్యలపై చేసిన పోరాటాలే ఆ గుర్తింపునకు పునాదులు వేస్తాయి. అలాంటి రాజకీయ నేపథ్యం కలిగిన కుటుంబం పరిటాల కుటుంబం. దివంగత పరిటాల రవి పేరు జిల్లాలో ఒక రాజకీయ అధ్యాయంగా నిలిచిపోయింది. పేదలు, బలహీన వర్గాలు, సామాన్య ప్రజల సమస్యలపై ఆయన సాగించిన పోరాటాలు, పార్టీ కార్యకర్తలకు అందించిన అండ, ప్రజలతో పెనవేసుకున్న అనుబంధం నేటికీ రాజకీయ చర్చల్లో ప్రస్తావనకు వస్తుంటాయి. ఆయన అడుగుజాడల్లో రాజకీయ బాధ్యతలను స్వీకరించిన పరిటాల సునీతమ్మ ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ పార్టీని ప్రజల్లో నిలబెట్టారు. ఇప్పుడు అదే కుటుంబ రాజకీయ వారసత్వాన్ని కొనసాగిస్తూ పరిటాల శ్రీరామ్ తనదైన రాజకీయ ప్రయాణాన్ని నిర్మించుకుంటున్నారు. తండ్రి సంపాదించిన ప్రజాభిమానాన్ని, తల్లి అందించిన రాజకీయ అనుభవాన్ని, పార్టీ నాయకత్వం చూపిన మార్గదర్శకత్వాన్ని కలగలిపి ముందుకు సాగుతున్నారు. నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం, నారా లోకేశ్ మార్గనిర్దేశకత్వంలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ జిల్లా రాజకీయాల్లో తనదైన ముద్ర వేస్తున్నారు.

విజయాల వెనుక కనిపించని శ్రమ.. కార్యకర్తలతో మమేకమైన నాయకత్వం!

రాజకీయాల్లో నాయకుడి స్థాయిని నిర్ణయించేది కేవలం ఆయన మాట్లాడే మాటలు కాదు.. పార్టీకి అవసరమైన సమయంలో ఎంతగా పనిచేశారన్నదే అసలైన కొలమానం. పరిటాల శ్రీరామ్ రాజకీయ ప్రస్థానంలో ఈ అంశం ప్రత్యేకంగా కనిపిస్తుంది. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మాత్రమే కాకుండా, ప్రతికూల రాజకీయ పరిస్థితుల్లోనూ పార్టీ శ్రేణులకు అండగా నిలుస్తూ తన ప్రయాణాన్ని కొనసాగించారు. ఎన్నికల సమయంలో గ్రామస్థాయి నాయకులతో సమన్వయం, కార్యకర్తల్లో ఉత్సాహం, అభ్యర్థులకు మద్దతు, పార్టీ విజయాల కోసం నిరంతర ప్రయత్నం ఆయన రాజకీయ కార్యాచరణలో భాగమయ్యాయి. రాప్తాడు, ధర్మవరం ప్రాంతాల్లో కూటమి రాజకీయ బలం పెరగడం, తాడిమర్రి, ముదిగుబ్బ వంటి ప్రాంతాల్లో తెలుగుదేశం పార్టీ విజయాలు సాధించడం పార్టీ శ్రేణుల్లో కొత్త విశ్వాసాన్ని నింపాయి. ఈ పరిణామాల మధ్య పరిటాల శ్రీరామ్ రాజకీయ పాత్రపై చర్చ మరింత విస్తృతమైంది. ఆయనకు పదవి రావాలనే ఆకాంక్ష వెనుక కుటుంబ నేపథ్యం ఒక్కటే కారణం కాదని, పార్టీ కోసం చేసిన కృషికి తగిన గుర్తింపు లభించాలనే భావన కూడా ఉందని కార్యకర్తలు చెబుతున్నారు. కష్టకాలంలో పార్టీని వీడకుండా పనిచేసిన వారికి నాయకత్వ బాధ్యతలు అప్పగించినప్పుడే కేడర్‌లో విశ్వాసం మరింత బలపడుతుందని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం.

4,181 ఓట్ల ఆధిక్యం.. నల్లచెరువు తీర్పుతో పెరిగిన రాజకీయ ప్రాధాన్యత!

నల్లచెరువు జెడ్పీటీసీ ఎన్నికల్లో పరిటాల శ్రీరామ్ సాధించిన విజయం ఆయన రాజకీయ ప్రయాణానికి కొత్త బలాన్ని అందించింది. 4,181 ఓట్ల భారీ ఆధిక్యంతో గెలుపొందడం ద్వారా ప్రజల మద్దతును స్పష్టంగా చాటుకున్నారు. ఈ విజయం నల్లచెరువు మండలానికే పరిమితమైన ఫలితంగా కాకుండా జిల్లా రాజకీయాల్లో ఆయన ప్రాధాన్యతను పెంచిన పరిణామంగా మారింది. ఒకవైపు గ్రామస్థాయి ప్రజా సమస్యలపై దృష్టి సారించాల్సిన బాధ్యత, మరోవైపు జిల్లా పరిషత్ ద్వారా అభివృద్ధి కార్యక్రమాలకు దిశానిర్దేశం చేసే అవకాశం.. ఈ రెండు అంశాలు ఇప్పుడు శ్రీరామ్ రాజకీయ భవిష్యత్తుపై ఆసక్తిని పెంచుతున్నాయి. జెడ్పీటీసీగా ప్రజలు ఇచ్చిన తీర్పుకు తగిన గుర్తింపుగా జిల్లా పరిషత్ చైర్మన్ బాధ్యతలు కూడా ఆయనకే అప్పగించాలని పార్టీ శ్రేణులు, అభిమానులు కోరుకుంటున్నారు. జిల్లా తొలి జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఆయన బాధ్యతలు చేపడితే పరిటాల కుటుంబ రాజకీయ చరిత్రలో మరో ప్రత్యేక అధ్యాయం చేరుతుందని అభిమానులు ఆశిస్తున్నారు. నల్లచెరువు ప్రజలు ఇచ్చిన తీర్పును జిల్లా స్థాయి నాయకత్వానికి బలమైన సంకేతంగా పరిగణిస్తున్నారు. ఈ నేపథ్యంలో చైర్మన్ ఎంపికపై జిల్లాలో రాజకీయ ఆసక్తి నెలకొంది.

పార్టీకి భరోసా.. కార్యకర్తలకు గుర్తింపు.. ప్రజలకు అభివృద్ధిపై ఆశలు!

జిల్లా పరిషత్ చైర్మన్ బాధ్యతలు చేపట్టే వ్యక్తి కేవలం రాజకీయ నాయకుడిగా కాకుండా జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి బాధ్యత వహించే నాయకుడిగా వ్యవహరించాల్సి ఉంటుంది. గ్రామాల్లో రహదారుల పరిస్థితి, తాగునీటి సమస్యలు, విద్యాసంస్థల అభివృద్ధి, వైద్య సదుపాయాలు, పారిశుద్ధ్యం, గ్రామీణ మౌలిక వసతుల కల్పన వంటి అంశాల్లో చొరవ చూపాల్సిన అవసరం ఉంది. పరిటాల శ్రీరామ్‌కు ఈ బాధ్యతలు దక్కితే పార్టీ శ్రేణులకు కొత్త ఉత్సాహం, యువ నాయకత్వానికి ప్రోత్సాహం, ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత బలమైన రాజకీయ వేదిక ఏర్పడుతుందని ఆయన మద్దతుదారులు ఆశిస్తున్నారు. తండ్రి పరిటాల రవి ప్రజల కోసం చేసిన పోరాటాలను ఒక స్ఫూర్తిగా తీసుకుని, పార్టీ కోసం తాను చేసిన కష్టాన్ని గుర్తింపుగా మలుచుకునే అవకాశం శ్రీరామ్‌కు రావాలని కోరుకుంటున్నారు. రాజకీయ వారసత్వం ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రజల ఆదరణ స్వయంగా లభించదు. ఆ ఆదరణను నిలబెట్టుకోవాలంటే నిరంతర కృషి, ప్రజలతో అనుబంధం, పార్టీ పట్ల నిబద్ధత అవసరం. ఆ దిశగా సాగుతున్న శ్రీరామ్‌కు జిల్లా పరిషత్ చైర్మన్ బాధ్యతలు అప్పగించడం సముచిత నిర్ణయమవుతుందని పార్టీ శ్రేణుల ఆకాంక్ష. పరిటాల రవి ప్రజల కోసం పోరాడిన రాజకీయ వారసత్వం.. పరిటాల సునీతమ్మ నిలబెట్టిన పార్టీ పునాదులు.. పరిటాల శ్రీరామ్ కొనసాగిస్తున్న రాజకీయ కృషి.. ఈ మూడు తరాల ప్రయాణానికి జిల్లా పరిషత్ పీఠం మరో గుర్తింపుగా నిలవాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఇప్పుడు జిల్లాలో వినిపిస్తున్న ఆకాంక్ష ఒక్కటే.. పార్టీ కోసం కష్టపడిన శ్రీరామ్‌కు సముచిత స్థానం కల్పించాలి.. ఆయన నాయకత్వానికి అవకాశం ఇవ్వాలి.. శ్రీ సత్యసాయి జిల్లా అభివృద్ధిలో ఆయన పాత్ర మరింత విస్తృతం కావాలి!



నిందితుడి కాలు భద్రపరచాలి

రాప్తాడు దాడి కేసులో

అమరావతి, నవంబర్ 11, అనంత జనశక్తి న్యూస్

రాప్తాడులో పదో తరగతి విద్యార్థినిపై దాడి కేసులో ఏపీ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో నిందితుడైన హేమంత్ (21)కు సర్జరీ ద్వారా తొలగించిన అతని కుడి కాలును సేఫ్‌గా ఉంచాలని అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశించింది. నిందితుడు హేమంత్‌పై పోలీసులు జరిపిన కాల్పుల ఘటనపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) విచారణ కోరుతూ దాఖలైన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి లీసా గిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా హైకోర్టు ఈ ఉత్తర్వులను జారీ చేసింది. అలాగే ఈ పిటిషన్‌పై కౌంటర్ అఫిడవిట్టు దాఖలు చేయాలని కూడా ధర్మాసనం ప్రభుత్వాన్ని ఆదేశించి, ఈ విచారణను డిసెంబర్ 30కి వాయిదా వేసింది.

నిందితుడు హేమంత్ అక్టోబర్ 31వ తేదీన పాఠశాలలోకి చొరబడి ఎలక్ట్రిక్ రంపంతో అమ్మాయిపై దాడికి పాల్పడ్డాడు. అయితే ఈ దాడిలో ఆ బాలిక తీవ్రంగా గాయపడింది. సత్వర వైద్య సేవల వల్ల ఆ బాలిక ప్రాణాలతో బయటపడింది. ప్రస్తుతం బెంగళూరులోని మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఈ దాడి ఘటనను సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం వెంటనే చర్యలకు పూనుకుంది. పోలీసులు ఆత్మకూరు అడవిలో హేమంత్‌ను అదుపులోకి తీసుకున్నారు. అయితే క్రైమ్ సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం హేమంత్‌ని తీసుకెళ్లగా.. అక్కడ పోలీసు సిబ్బందిపై రాళ్లు విసిరి వారిని గాయపరిచాడని, దీంతో పోలీసులు నిందితుడిపై కాల్పులు జరపగా అతని కాలికి గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. అయితే రక్తనాళాలు దెబ్బతినడం వల్ల గ్యాంగ్రీన్ ఏర్పడటంతో, అనంతపురం జిల్లా ఆస్పత్రిలోని వైద్యులు హేమంత్ కుడి కాలును తొలగించడం జరిగింది. నిందితుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

అయితే నిందితుడి హేమంత్‌పై పోలీసుల కాల్పులను అనుమానాలు వ్యక్తం చేస్తూ.. దీనిపై సీబీఐ విచారణ జరిపించాలని కోరుతూ మంగళగిరికి చెందిన న్యాయవాది గుండ గోపీకృష్ణ పిల్ వేశారు. కాగా ఈ కేసులో విద్యాశాఖ అధికారులను ప్రతివాదులుగా చేర్చాలన్న అభ్యర్థనను మాత్రం కోర్టు తిరస్కరించింది. ఈ పిల్ విచారణ సమయంలో నిందితుడు హేమంత్‌ను జ్యుడిషియల్ కస్టడీకి రిమాండ్ చేశారని, అతనికి చికిత్స జరుగుతోందని ప్రత్యేక ప్రభుత్వ లాయర్ ఎస్.ప్రణతి కోర్టుకు తెలియజేశారు. నిబంధనల ప్రకారం, తొలగించిన కాలుకు ఫోరెన్సిక్ పరీక్ష జరుగుతోందని కూడా ఆమె వెల్లడించారు.

'పరివర్తన రాజనీతి పార్టీ'

అమరావతి, నవంబర్ 11, అనంత జనశక్తి న్యూస్



మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కొత్త పార్టీ ప్రకటించారు. పార్టీ పేరును 'పరివర్తన రాజనీతి పార్టీ' (పీఆర్‌పీ)గా వెల్లడించారు. విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ పేరు, జెండాను ఆయన ఆవిష్కరించారు. దేశం కోసం, ధర్మం కోసం అనే నినాదంతో పార్టీని ఏర్పాటు చేశారు. జెండాను పైన కాషాయం, కింద తెలుపు రంగులు.. మధ్యలో చక్రంతో రూపొందించారు.

పార్టీ పేరు ప్రకటించిన అనంతరం విజయసాయిరెడ్డి మాట్లాడారు. ''ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు ఏ ఒక్క నాయకుడి చేతిలో లేదు.. అంతా ప్రజల చేతిలోనే ఉంది. ఓటుతో వారి పాత్ర ముగిసిపోదు. తప్పు చేస్తే ఎవరినైనా ప్రశ్నించాలి. మంచి పని ఎవరు చేసినా అభినందించాల్సిందే. 'పరివర్తన రాజనీతి పార్టీ' .. ఇంకో నాయకుడిని ఇవ్వడానికి రాలేదు. యువతలో ఉన్న నాయకత్వ లక్షణాలను బయటకు తీసుకొచ్చేందుకు దీన్ని ప్రారంభించాం. సీఎం కావాలని నేను కోరుకోవడం లేదు. వారసత్వ రాజకీయాలకు స్వస్తి చెప్పాలి. ప్రతి సామాజిక వర్గంలోని నాయకులను ప్రోత్సహిస్తాం.'' అని విజయసాయిరెడ్డి అన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరో కొత్త పార్టీకి బీజం పడింది. మాజీ రాజ్యసభ సభ్యుడు వి. విజయసాయిరెడ్డి నూతన రాజకీయ ప్రస్థానానికి శ్రీకారం చుట్టారు. గత కొంతకాలంగా మారుతున్న పరిణామాల మధ్య ఆయన సొంతంగా కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. తన నూతన రాజకీయ వేదికకు 'పరివర్తన రాజనీతి పార్టీ' అని పేరు నిర్ణయించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న రాజకీయ వాతావరణం, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నూతన విధానాలతో ముందుకు సాగేందుకే ఈ పార్టీని స్థాపిస్తున్నట్లు విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. 'పరివర్తన' అనగా మార్పు అని..... ప్రజలకు జవాబుదారీగా ఉండే నిజమైన రాజనీతిని అందించడమే తమ పార్టీ ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.

జెండా గుర్తు విడుదల...

కాషాయం, తెలుపు రంగుల సమ్మేళనంతో రూపొందించిన పార్టీ జెండా మధ్యలో ధర్మచక్రం గుర్తును పార్టీ ప్రాథమిక చిహ్నంగా విజయసాయిరెడ్డి వెల్లడించారు. దేశభక్తి, ప్రజల సంక్షేమం, ధర్మబద్ధమైన రాజనీతికి సంకేతంగా ఈ చిహ్నాన్ని ఎంచుకున్నట్లు వివరించారు. "జనం కోసం.. జన హితం కోసం" అనే ప్రధాన నినాదంతో ప్రజాక్షేత్రంలోకి అడుగుపెడుతున్నట్లు విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న రాజకీయ కూటములు, సాంప్రదాయ పార్టీల తీరుకు భిన్నంగా ప్రజలకు బలమైన మూడో ప్రత్యామ్నాయ శక్తిగా నిలబడటమే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని ప్రకటించారు.

నూతన పార్టీ ఆవిర్భావం సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో జెన్‌జీ యువతను రేపటి రాజకీయ నాయకులుగా తీర్చిదిద్దే ఒక కార్యాచరణ ఫ్యాక్టరీలా తమ పార్టీ పనిచేస్తుందని పేర్కొన్నారు. కుల, మత రాజకీయాలకు అతీతంగా పాలన సాగించడమే ధ్యేయంగా పనిచేస్తామన్నారు.

వైఎస్సార్‌సీపీలో సుదీర్ఘకాలం పాటు అత్యంత కీలక నేతగా, పార్లమెంటరీ పార్టీ నేతగా బాధ్యతలు నిర్వర్తించిన విజయసాయిరెడ్డి... కొద్ది నెలలక కిందటే పార్టీకి మరియు రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఆ నిర్ణయం తర్వాత ఆయన రాజకీయ భవిష్యత్తుపై రకరకాల ఊహాగానాలు రాగా.... వాటన్నింటికీ తెరదించుతూ నేరుగా కొత్త పార్టీ ప్రకటన చేయడం ఏపీ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

తమ కొత్త పార్టీ ప్రధాన ఉద్దేశం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, ఇక్కడి ప్రజల ప్రయోజనాలను కాపాడటమేనని విజయసాయిరెడ్డి చెప్పారు. ఢిల్లీలో కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ.... కేంద్ర ప్రభుత్వంతో సమర్థవంతంగా సమన్వయం చేసుకుంటూ ఏపీ ప్రజలకు దక్కాల్సిన న్యాయాన్ని, నిధులను రాబట్టడానికి తమ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని వివరించారు. ఒకప్పుడు వైఎస్సార్‌సీపీలో అత్యంత కీలక నాయకుడిగా వెలుగొందిన విజయసాయిరెడ్డి.... మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా వ్యవహరించేవారు. అయితే ఆ పార్టీతో విభేదించి బయటకు వచ్చిన ఆయన.... ఇప్పుడు సొంతంగా రాజకీయ పార్టీని ప్రకటించి ముందుకు వెళ్తున్నారు.

2024తో పోలిస్తే వైసీపీ ఓటింగ్ పెరిగింది

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికలు స్వేచ్ఛగా, సజావుగా జరిగి ఉంటే వైసీపీకి మరింత భారీగా ఓటింగ్ శాతం నమోదయ్యేదని జగన్ అభిప్రాయపడ్డారు. ఎన్నికల్లో జరిగిన అక్రమాలు బయటపడితే తన ప్రభుత్వం చిక్కుల్లో పడుతుందనే భయంతోనే చంద్రబాబు ఇలాంటి చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఎన్నికల్లో అక్రమాలకు సంబంధించి చంద్రబాబు సరికొత్త విధానాలను ప్రవేశపెట్టారని విమర్శించారు. అన్ని అడ్డంకులను అధిగమించి వైసీపీ విజయం సాధించిన చోట కూడా అక్రమాలకు పాల్పడి ఫలితాలను తారుమారు చేశారని ఆరోపించారు. గతంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక ఎన్నికల్లో అక్రమాలు జరిగాయంటూ చంద్రబాబు ఆరోపణలు చేశారని, లేని విషయాలను సృష్టించి అబద్ధాలు ప్రచారం చేశారని జగన్ విమర్శించారు. ఇప్పుడు అదే చంద్రబాబు ప్రభుత్వం ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడి, వాటిని సమర్థించుకునే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. ఇన్ని దుర్మార్గాలకు పాల్పడిన తర్వాత ప్రజాస్వామ్యం గురించి నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు.

ఎన్నికల్లో ఇలాంటి అక్రమాలు ఎప్పుడూ చూడలేదు.. జగన్‌ను కలిసిన వివిధ జిల్లాల నాయకులు తమ రాజకీయ జీవితాల్లో ఎన్నికల్లో ఇలాంటి అక్రమాలను ఎప్పుడూ చూడలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించాల్సిన రాష్ట్ర ఎన్నికల సంఘం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఏజెంట్లకు బదులుగా బౌన్సర్లను ఏర్పాటు చేసి లెక్కింపు ప్రక్రియను నిర్వహించారని నాయకులు జగన్ దృష్టికి తీసుకెళ్లారు. అభ్యర్థుల బంధువులను కిడ్నాప్ చేసి నామినేషన్ల ఉపసంహరణకు ఒత్తిడి తీసుకొచ్చారని ఆరోపించారు. ఓట్ల లెక్కింపు సమయంలో చెల్లని ఓట్ల పేరుతో పెద్ద సంఖ్యలో వైసీపీ ఓట్లను తొలగించారని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో లెక్కింపు కేంద్రాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేసి మరీ ఫలితాలను తారుమారు చేశారని ఆరోపించారు. వైసీపీ అభ్యర్థులు గెలిచిన చోట పదేపదే రీకౌంటింగ్ నిర్వహించి లెక్కల్లో మార్పులు చేశారని, అయితే వైసీపీ నేతలు కోరిన చోట మాత్రం రీకౌంటింగ్‌కు అవకాశం కల్పించలేదని నాయకులు వెల్లడించారు. అధికార పార్టీకి అనుకూలంగా అదనపు బ్యాలెట్ పేపర్లు అందించి, ఆ పార్టీ అభ్యర్థులు గెలిచేలా అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు.

గ్రామగ్రామాన చంద్రబాబు బాధితులు ఉన్నారు..

ఈ ఎన్నికల సందర్భంగా చంద్రబాబు చేయించిన దాడుల కారణంగా రాష్ట్రంలోని గ్రామగ్రామాన బాధితులు ఉన్నారని వైసీపీ నాయకులు పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో తమ పార్టీ అభ్యర్థులు, కార్యకర్తలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని జగన్‌కు వివరించారు. ఎన్నికల షెడ్యూల్ నుంచి ఫలితాల ప్రకటన వరకు జరిగిన పరిణామాలను పార్టీ నాయకులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల్లో ఎదురైన అనుభవాలు, అక్రమాలపై పార్టీ నాయకులతో చర్చించిన జగన్.. పార్టీ శ్రేణులు ధైర్యంగా పోరాటం చేశాయని పేర్కొన్నారు.

సింగపూర్ ప్రతినిధులతో లోకేశ్ భేటీ



మూడో జేఐఎస్‌సీ సమావేశం

అమరావతి, నవంబర్ 11, అనంత జనశక్తి న్యూస్

రాజధాని అమరావతిలోని ఏపీ సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో మూడో 'జాయింట్ ఇంప్లిమెంటేషన్ స్టీరింగ్ కమిటీ' సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా సింగపూర్ ప్రతినిధి బృందంతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. అమరావతి రాజధాని అభివృద్ధికి సంబంధించి పరస్పర సహకారం, భవిష్యత్తు కార్యాచరణపై ఏపీ ప్రభుత్వం, సింగపూర్ ప్రతినిధి బృందం సమీక్షించాయి. అమరావతి అభివృద్ధి, నిర్మాణ పనుల పురోగతిపై జేఐఎస్‌సీ చర్చించింది.

స్పైసీ ఫుడ్.. స్పీడీ అప్రూవల్స్ మా స్టైల్: లోకేశ్

విశాఖకు విచ్చేసిన అంతర్జాతీయ ప్రతినిధులకు మంత్రి నారా లోకేశ్ వినూత్న స్వాగతం పలికారు. ఆంధ్రాలో 'నాన్ స్పైసీ' అనేది మెనూలో ఉండదని చమత్కరించారు. ఘాటైన ఆహారం.. వేగంగా అనుమతులు.. ఇదే ఆంధ్రా స్టైల్ అంటూ 'ఎక్స్'లో పోస్టు చేశారు. స్పైసీ ఫుడ్.. స్పీడీ అప్రూవల్స్... ఇదే ఆంధ్రా విధానమన్నారు. 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు ప్రపంచ ప్రతినిధులను లోకేశ్ ఆహ్వానించారు. విశాఖలో ఈ నెల 12, 13 తేదీల్లో ఈ సమిట్ జరగనుంది.

నా గుండె వేగంగా కొట్టుకుంది

- అంతమంది జర్నలిస్టులను చూసి..
- కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ
- 1999లో కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు ప్రయత్నించినపుడు
- ఒత్తిడి, అనిశ్చితి తనను బాగా ఆందోళనకు గురిచేశాయి

కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ తన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' లో పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు. 1999లో కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు ప్రయత్నించినపుడు ఎదురైన ఒత్తిడి, అనిశ్చితి తనను బాగా ఆందోళనకు గురిచేశాయని ఆమె తెలిపారు. రాష్ట్రపతి భవన్ ప్రాంగణంలో పెద్ద సంఖ్యలో ఉన్న మీడియా ప్రతినిధులతో మాట్లాడేందుకు వెళ్లినప్పుడు తన గుండె వేగంగా కొట్టుకుందని, తన రాజకీయ జీవితంలో అంతమంది మీడియా ప్రతినిధులతో మాట్లాడడం అదే మొదటిసారి అని ఆమె పేర్కొన్నారు.

1999లో అన్నాడీఎంకే చీఫ్ జయలలిత మద్దతు ఉపసంహరించుకోవడంతో అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం కూలిపోయింది. అప్పుడు అతిపెద్ద ప్రతిపక్ష పార్టీగా ఉన్న కాంగ్రెస్.. ప్రాంతీయ, లెఫ్ట్ పార్టీలతో కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు ప్రయత్నాలు ప్రారంభించింది. 543 మంది సభ్యులున్న లోక్‌సభలో ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మెజారిటీ మార్కు 272. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలకు కలిపి 233 మంది ఎంపీల బలం ఉండగా.. ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు ఇస్తామని మరికొందరు హామీ ఇచ్చారని సోనియా తన ఆత్మకథలో పేర్కొన్నారు. దీంతో అవసరమైన సంఖ్యాబలం సమకూరుతుందనే నమ్మకంతో రాష్ట్రపతిని కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని కోరామని ఆమె వివరించారు.అయితే ..రాష్ట్రపతి భవన్ వెలుపల మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలు తనను తీవ్ర ఒత్తిడికి గురిచేశాయని సోనియా గుర్తుచేశారు. '272 మంది సభ్యుల మద్దతు ఉందని చెబుతున్నారు. ఆ సంఖ్యను ఎలా లెక్కించారు?' అని ఓ మీడియా ప్రతినిధి ప్రశ్నించారని తెలిపారు. అలాగే 'మీ పార్టీ అహంకారమే ఈ పరిస్థితికి కారణం కాదా?' అని మరో ప్రతినిధి అడిగారని తెలిపారు. తమ లెక్కలను మిత్రపక్షాల నేతలతో చర్చించిన తర్వాతే సిద్ధం చేశామని సమాధానమిచ్చినట్లు సోనియా వెల్లడించారు. ఆ సమయంలో అవసరమైన సంఖ్యాబలం లేకపోయినా.. ఇతర పార్టీలతో చర్చలు కొనసాగుతున్నాయని, మెజారిటీ సాధిస్తామనే విశ్వాసం ఉందని పేర్కొన్నట్లు వెల్లడించారు. కానీ, చివరకు తాము ఆశించిన మద్దతు లభించలేదని పేర్కొన్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు ఇస్తామని హామీ ఇచ్చిన నేతల్లో పలువురు ప్రధానమంత్రి పదవిని ఆశించడమే చర్చలు విఫలం కావడానికి ఒక కారణమని వివరించారు. అయితే, తనకు మాత్రం ప్రధానమంత్రి కావాలనే కోరిక లేదని సోనియా స్పష్టం చేశారు. బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని గద్దె దించాలనే లక్ష్యంతోనే తొందరపడి ముందుకెళ్లానని అంగీకరించారు.

మెదక్ అభివృద్ధిలో మరో కీలక ముందడుగు

- రెవెన్యూ, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల ఏర్పాటుకు టెండర్లు పూర్తి
- ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ప్రత్యేక చొరవతో కార్యరూపంలోకి అడుగులు

మెదక్ నవంబర్ 11, అనంత జనశక్తి న్యూస్



నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా, ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయాలనే సంకల్పంతో మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు మరో కీలక ముందడుగు వేశారు. ఆయన ప్రత్యేక చొరవతో మెదక్, నిజాంపేట మండలాల్లో మండల రెవెన్యూ కార్యాలయాల (ఎంఆర్ఓ) ఏర్పాటుకు, అలాగే మెదక్, రామాయంపేట పట్టణాల్లో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల ఏర్పాటుకు సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తయింది.రెవెన్యూ, భూముల రిజిస్ట్రేషన్ సేవల కోసం ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరాన్ని తగ్గించడంతో పాటు, సమయం, ప్రయాణ ఖర్చులు ఆదా చేసే దిశగా ఈ కార్యాలయాల ఏర్పాటు దోహదపడనుంది. స్థానికంగానే ప్రభుత్వ సేవలు అందుబాటులోకి రావడంతో ప్రజలకు మరింత సౌలభ్యం కలగనుంది.ప్రజల అవసరాలను గుర్తించి ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు తెలిపారు. టెండర్ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో తదుపరి పనులను వేగవంతం చేసి కార్యాలయాలను త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల కల్పన, ప్రభుత్వ సేవల మెరుగుదల, ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఆయన స్పష్టం చేశారు. మొత్తంగా నాలుగు ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు టెండర్లు పూర్తికావడం మెదక్ నియోజకవర్గ అభివృద్ధిలో మరో కీలక పరిణామంగా నిలుస్తోంది.

ప్రపంచ వాతావరణ చర్యలను ముందుకు తీసుకెళ్లడంలో
భారత్ కీలక పాత్ర: డా. పి.కె. మిశ్రా

- ఐఐఎమ్-కోజికోడ్ లో జరిగిన ఎన్విరాన్మెంట్ ఫర్ డెవలప్మెంట్ (EfD) నెట్వర్క్ 20వ వార్షిక సమావేశంలో డా. పి.కె. మిశ్రా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు.
- స్థిరమైన ఆహార వ్యవస్థల కోసం పరిశోధన, డేటా, విధానాల అనుసంధానించాలన్న డా. పి.కె. మిశ్రా
- "డేటా కేవలం ఫలితాలను అంచనా వేయడమే కాదు, సవాళ్లను ముందుగానే ఊహించేలా మనకు సహాయపడాలి": డా. పి.కె. మిశ్రా
- 651 వ్యవసాయ జిల్లాలలో 310 జిల్లాలు వాతావరణ మార్పుల ముప్పును ఎదుర్కొంటున్నాయి; ప్రాంతాలకు తగిన పరిష్కారాలు అవసరమని డాక్టర్ పి.కె. మిశ్రా
- అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరంగా ప్రధానమంత్రి చొరవ వాటి పోషక విలువలకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చింది: డా. పి.కె. మిశ్రా
- గ్లోబల్ సౌత్ అంతటా బలమైన పరిశోధన-విధాన భాగస్వామ్యాల కోసం డా. పి.కె. మిశ్రా పిలుపునిచ్చారు.

వాతావరణ మార్పు, వ్యవసాయ స్థితిస్థాపకత, ఆహార భద్రత, పోషకాహారానికి సంబంధించిన పరస్పర అనుసంధాన సవాళ్లను ఎదుర్కోవడానికి శాస్త్రీయ పరిశోధన, సూక్ష్మస్థాయి డేటా మరియు సాక్ష్యాధారిత విధాన రూపకల్పనను మరింత గట్టిగా అనుసంధానించాలని ప్రధానమంత్రి ప్రధాన కార్యదర్శి డా. పి.కె. మిశ్రా పిలుపునిచ్చారు.

కోజికోడ్ ఐఐఎమ్ లో జరిగిన ఎన్విరాన్మెంట్ ఫర్ డెవలప్మెంట్ (EfD) నెట్వర్క్ 20వ వార్షిక సమావేశ ప్రారంభ సదస్సును వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉద్దేశించి మాట్లాడిన డా. మిశ్రా.. వాతావరణ మార్పును ఇకపై కేవలం పర్యావరణ సమస్యగా మాత్రమే చూడకూడదని, దాని ప్రభావాలు వ్యవసాయ ఉత్పత్తి, నీటి లభ్యత, ఆహార ధరలు, ప్రజారోగ్యం, జీవనోపాధిపై కూడా విస్తరించి ఉన్నాయన్నారు.

సాంప్రదాయక ఆహార భద్రతా విధానాలకు అతీతంగా ముందుకు వెళ్లాల్సిన అవసరాన్ని వెల్లడిస్తూ.. తగినంత ఆహార ఉత్పత్తి మాత్రమే సరిపోదు అన్నారు. ముఖ్యంగా వాతావరణ సంబంధిత అంతరాయాలు పప్పుధాన్యాలు, పండ్లు, కూరగాయలు, పాలు మరియు ఇతర పోషకాలతో కూడిన ఆహారాల లభ్యతను, ధరలను ప్రభావితం చేసే తరుణంలో.. అందరికీ అందుబాటు ధరలో, వైవిధ్యభరితమైన, పోషకాహారం లభించేలా చూడటం కూడా అంతే ముఖ్యమన్నారు.

పంట మార్పిడి ప్రాముఖ్యతను వివరిస్తూ, ఐక్యరాజ్యసమితి 2023ని అంతర్జాతీయ చిరుధాన్యాల ఏడాదిని ప్రకటించేలా చేయడంలో ప్రధానమంత్రి తీసుకున్న చొరవను డాక్టర్ పి.కె. మిశ్రా ప్రస్తావించారు. చిరుధాన్యాల పోషక విలువలు, పర్యావరణ స్థిరత్వాలపై ప్రపంచవ్యాప్తంగా దృష్టిసారించడానికి ఈ ప్రయత్నం ఎంతగానో దోహదపడిందని పేర్కొన్నారు. అలాగే.. వైవిధ్యభరితమైన మరియు స్థితిస్థాపకమైన ఆహార వ్యవస్థలలో భాగంగా చిరుధాన్యాలను మరింత విస్తృతంగా స్వీకరించడాన్ని ఇది ప్రోత్సహించిందని ఆయన తెలిపారు.

ప్రాంతీయనిర్దిష్ట వాతావరణ అనుకూలత వైపు మారాలని కోరుతూ, ఐకార్ (ICAR) నేషనల్ ఇన్నోవేషన్స్ ఇన్ క్లైమేట్ రెసిలియంట్ అగ్రికల్చర్ ప్రోగ్రామ్ కింద నిర్వహించిన అంచనాలలో 651 వ్యవసాయ జిల్లాల్లో 310 జిల్లాలు అత్యధికంగా లేదా చాలా ఎక్కువగా ముప్పును ఎదుర్కొంటున్నట్లు గుర్తించాయని డా. మిశ్రా వెల్లడించారు. ఏకరీతి విధాన విధానాల కంటే, స్థానిక వ్యవసాయవాతావరణ పరిస్థితులకు తగినట్లుగా స్పందించాల్సిన అవసరాన్ని ఇది తెలియజేస్తోందని ఆయన అన్నారు.

విధాన రూపకల్పనలో డేటా పాత్ర గురించి మాట్లాడుతూ, కేవలం ఎక్కువ డేటాను సృష్టించడం మాత్రమే ప్రాధాన్యత కాకూడదని, సమాచారం సమయానికి తగినట్లుగా, విశ్వసనీయంగా, పోల్చదగినదిగా మరియు ఆచరణాత్మకంగా ఉండేలా చూడాలని పేర్కొన్నారు. వర్షపాతం, నీటి లభ్యత, నేల పరిస్థితులు, పంటల పనితీరు, పోషకాహార ఫలితాలలో తేడాలను గుర్తించడానికి విడివిడిగా ఉన్న, జిల్లా స్థాయి డేటాను మరింతగా ఉపయోగించాలని ఆయన పిలుపునిచ్చారు. పరిపాలనా రికార్డులు, గృహ సర్వేలు, ఉపగ్రహ చిత్రాలు, భౌగోళిక సమాచారాన్ని సాధారణ ప్రమాణాలు, తగిన రక్షణలతో సమన్వయం చేయాలని ఆయన సూచించారు. పరిశోధన, డేటా ద్వారా కార్యక్రమాల అమలు, పర్యవేక్షణ మరియు వనరుల కేటాయింపు మెరుగ్గా జరిగేలా రాష్ట్ర, జిల్లా స్థాయిలలోని సంస్థల విశ్లేషణ సామర్థ్యాన్ని బలోపేతం చేయడం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు.

భారతదేశ వాతావరణ ప్రతిజ్ఞలను ప్రస్తావిస్తూ, ఆర్థిక వృద్ధి, పేదరిక నిర్మూలన మరియు మెరుగైన జీవన ప్రమాణాలను కాపాడుకుంటూనే, 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరించడం, 2070 నాటికి నికర శూన్య ఉద్గారాల లక్ష్యాన్ని సాధించడం అనే రెండు ఉద్దేశాలను దేశం అనుసరిస్తోందని పునరుద్ఘాటించారు. భారతదేశ నవీకరించిన నేషనల్లీ డిటర్మైండ్ కాంట్రిబ్యూషన్ (NDC) 2031-2035 దాని వాతావరణ ఆశయాలను మరింత బలోపేతం చేసిందని ఆయన పేర్కొన్నారు.

ప్రపంచ వాతావరణ చర్యలో భారత నాయకత్వాన్ని ప్రస్తావిస్తూ.. అంతర్జాతీయ సౌర కూటమి (ISA) మరియు విపత్తు నిరోధక మౌలిక సదుపాయాల కూటమి (CDRI) వంటి కార్యక్రమాలను డా. మిశ్రా ప్రస్తావించారు. ఇవి స్వచ్ఛ ఇంధనం, వాతావరణాన్ని తట్టుకునే మౌలిక సదుపాయాలపై అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించడానికి భారత్ చేస్తున్న ప్రయత్నాలను ప్రతిబింబిస్తాయని అన్నారు. వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి సామూహిక చర్యలు, వినూత్న భాగస్వామ్యాలు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాల అభివృద్ధి ప్రాధాన్యతలకు తగిన పరిష్కారాలు అవసరమని ఆయన తెలిపారు.

అంతర్జాతీయ పరిశోధన సహకార ప్రాముఖ్యతను తెలియజేస్తూ.. వాతావరణ వైవిధ్యం, సహజ వనరుల ఒత్తిళ్లు, మారుతున్న వ్యవసాయ సరళి, పోషకాహార భద్రతకు సంబంధించి గ్లోబల్ సౌత్ లోని దేశాలు ఉమ్మడి సవాళ్లను ఎదుర్కొంటున్నాయని డా. మిశ్రా అన్నారు. విద్యాపరమైన పరిశోధనలను ఆచరణాత్మక విధాన సవాళ్లతో అనుసంధానించడంలో, జ్ఞానాన్ని పంచుకోవడంలో మరియు సంస్థాగత సామర్థ్యాలను బలోపేతం చేయడంలో ఎన్విరాన్మెంట్ ఫర్ డెవలప్మెంట్ నెట్వర్క్ వంటి వేదికలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.

నేత్రదానంతో మరొకరి జీవితాల్లో వెలుగులు



- రోటరీ క్లబ్ ధర్మవరం ఆధ్వర్యంలో కీర్తిశేషులు ఆర్వేటి గంగయ్య నేత్రదానం
- కుటుంబ సభ్యుల సమ్మతితో నేత్రదానం..
- ఇద్దరి జీవితాల్లో చూపు వెలుగులు నింపేందుకు సహకారం
- రెడ్‌క్రాస్ ఐ రిట్రీవల్ సెంటర్ టెక్నీషియన్ రాఘవ సహకారంతో నేత్రాల సేకరణ

శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి, నవంబర్ 11, అనంత జనశక్తి న్యూస్:

రోటరీ క్లబ్ ధర్మవరం వారి ఆధ్వర్యంలో కీర్తిశేషులు ఆర్వేటి గంగయ్య నేత్రదానం కార్యక్రమం నిర్వహించారు. ధర్మవరం పట్టణానికి చెందిన కీర్తిశేషులు ఆర్వేటి సాయి లీలమ్మ భర్త ఆర్వేటి గంగయ్య మృతి అనంతరం కుటుంబ సభ్యులు ముందుకు వచ్చి నేత్రదానానికి అంగీకరించారు. ఆయన నేత్రాలను దానం చేయడం ద్వారా చూపు కోల్పోయిన వారికి వెలుగును అందించేందుకు తమ వంతు సహకారం అందించారు.అనంతపురం రెడ్‌క్రాస్ సొసైటీ ఐ రిట్రీవల్ సెంటర్ నుంచి విచ్చేసిన టెక్నీషియన్ రాఘవ సహకారంతో కీర్తిశేషులు ఆర్వేటి గంగయ్య కుమారులు ఆర్వేటి కిషోర్, ఆర్వేటి శ్రీధర్ తమ తండ్రి నేత్రదాన ప్రక్రియను పూర్తి చేయించారు. కుటుంబ సభ్యుల ఈ నిర్ణయం పలువురికి ఆదర్శంగా నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివయ్య, సుదర్శన్ గుప్తా, బి.వి. చలం, ప్రముఖ ఆప్తాల్మాలజిస్ట్ డాక్టర్ ఎస్. నరసింహులు, శ్రీనివాస్ రెడ్డి, నరేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మృతదేహానికి గౌరవం చూపడంతో పాటు నేత్రదానం ద్వారా మరొకరి జీవితంలో వెలుగులు నింపాలనే ఆర్వేటి కుటుంబ సభ్యుల నిర్ణయాన్ని రోటరీ క్లబ్ సభ్యులు అభినందించారు. నేత్రదానంపై ప్రజల్లో మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.

టీటీడీ సాధికారిక మండలి సభ్యుడిగా వినయ్ చంద్ ప్రమాణ స్వీకారం



- నూతన బాధ్యతలు స్వీకరణ.. అభినందనలు తెలిపిన జేఈవో వెంకయ్య చౌదరి

తిరుమల నవంబర్ 11 అనంత జనశక్తి న్యూస్

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) సాధికారిక మండలి సభ్యుడిగా నియమితులైన శ్రీ వినయ్ చంద్ ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. తిరుమలలో నిర్వహించిన కార్యక్రమంలో టీటీడీ జేఈవో శ్రీ వెంకయ్య చౌదరి సమక్షంలో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు.ఈ సందర్భంగా జేఈవో వెంకయ్య చౌదరి వినయ్ చంద్‌కు తీర్థప్రసాదాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. స్వామివారి ఆశీస్సులతో నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని, టీటీడీ అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు.టీటీడీ సాధికారిక మండలి సభ్యుడిగా బాధ్యతలు చేపట్టిన వినయ్ చంద్‌కు పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపారు. భగవంతుని సేవలో అంకితభావంతో పనిచేస్తూ తన బాధ్యతలను విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు.

వైసీపీ నేతలపై వ్యతిరేక విమర్శలు సరికాదు

- మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి కి సూచించిన మాజీ మేయర్ మహమ్మద్ వసీం

అనంతపురం నవంబర్ 11 అనంత జనశక్తి న్యూస్



ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన వైసీపీ నేతలపై వ్యతిరేక విమర్శలు చేయడం సరికాదని మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి కి మాజీ మేయర్ మహమ్మద్ వసీం సూచించారు.జిల్లా వైసిపి కార్యాలయంలో బుధవారం మాజీ మేయర్ మహమ్మద్ వసీం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మాజీ మంత్రి శైలజానాథ్, మాజీ ఎమ్మెల్యేలు అనంత వెంకటరామి రెడ్డి,విశ్వేశ్వర రెడ్డి లపై మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించారు.జేసీ ప్రభాకర్ రెడ్డి అంత రాజకీయ అనుభవం తమ వయసు లేదని,గతంలో ఆయన ప్రెస్ మీట్ లు పెడితే ఆసక్తిగా వినేవారమన్నారు.అయితే ఇటీవల కాలంలో జేసీ ప్రభాకర్ రెడ్డి ప్రెస్ మీట్ లు పెడితే వ్యక్తిగత దూషణలు తప్పా మరేమీ ఉండటం లేదనే భావన మాతో పాటు అన్ని వర్గాలలో వ్యక్తమవుతోందన్నారుమాజీ మంత్రి శైలజానాథ్, మాజీ ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి,విశ్వేశ్వర రెడ్డి లు ప్రజాస్వామ్య బద్ధంగానే ఎంపికలుగా,ఎమ్మెల్యేలుగా,మంత్రులుగా ఎంపిక అయ్యారన్నారు.40 ఏళ్ళు రాజకీయ అనుభవం ఉన్న అనంత వెంకటరామిరెడ్డి పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తూ,బెదిరింపు ధోరణిలో మాట్లాడటం సరికాదని ఆయన సూచించారు.మొన్నటి ఎన్నికలు ప్రజాస్వామ్య బద్ధంగా జరిగాయని మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి మాట్లాడారని ప్రజాస్వామ్య బద్ధంగా జరిగి ఉంటే ఇన్ని గొడవలు,రిగ్గింగ్ లు,సైక్లింగ్ లు,బూత్ క్యాప్చర్ లు జరిగి ఉండేవా అని ఆయన ప్రశ్నించారు. అనంతపురం, గుంతకల్లు, కల్యాణ దుర్గం,తాడిపత్రిలలో ఏ విధంగా ఎన్నికలు జరిగాయో ప్రజలు అన్ని గమనిస్తున్నారన్నారు.గతంలో వైసీపీ హయాంలో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు జరిగాయి కాబట్టే మీరు మున్సిపల్ చైర్మన్ అయ్యారు అని గుర్తుంచుకోవాలని ఆయన సూచించారు. అదే విధంగా అనంత వెంకటరెడ్డి కానీ,అనంత వెంకటరామిరెడ్డి కానీ ప్రజాస్వామ్య బద్ధంగానే ఎన్నికల్లో ఎంపిక అయ్యారన్నారు.40 ఏళ్లలో అనంత వెంకటరామిరెడ్డి నగరంలో కానీ,జిల్లాలో కానీ ఏమీ అభిరుద్ధి చేశారో జిల్లా ప్రజలు అందరికీ తెలుసు అని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికైనా జేసీ ప్రభాకర్ రెడ్డి వ్యక్తిగత దూషణలు మానీ హుందాగా మాట్లాడితే ప్రజలు హర్షిస్తారని ఆయన సూచించారు.విలేకరుల సమావేశంలో మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు మొఘల్ సైఫుల్లా బేగ్, కార్పొరేటర్లు అనిల్ కుమార్ రెడ్డి, షేక్ ఖాజా , జ్ఞానేశ్వర్,సుకేష్,మాజీ కార్పొరేటర్లు రహంతుల్లా, ఇషాక్, కమల్ భూషణ్,నాయకులు ఖాజా,కిషోర్,మైనుద్దీన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఒక్క క్షణం స్పందన.. ఒక నిండు ప్రాణానికి రక్షణ..!

- ప్రమాద సమయాల్లో బాధితులను ఆదుకోవడంలో మానవత్వంతో ముందుకు రావాలి
- సహాయం చేసే వారికి చట్టపరమైన రక్షణ ఉంది

పాత్రికేయుల సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామ్ గోపాల్

కడప, నవంబర్ 11: అనంత జనశక్తి న్యూస్



రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తికి సకాలంలో అందించే చిన్న సహాయం కూడా ఒక నిండు ప్రాణాన్ని కాపాడగలదని, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ మానవత్వంతో ముందుకు రావాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామ్ గోపాల్ పిలుపునిచ్చారు. మన కళ్లముందు ఒక మనిషి ప్రాణం కోసం పోరాడుతున్నప్పుడు చట్టపరమైన ఇబ్బందులు, పోలీసు విచారణ, ఆసుపత్రి లాంఛనాల గురించి ఆలోచిస్తూ సహాయం చేయడానికి వెనుకాడకూడదని సూచించారు. ప్రమాద బాధితుడిని సకాలంలో ఆసుపత్రికి చేర్చడం ద్వారా ఒక కుటుంబానికి తీరని దుఃఖాన్ని దూరం చేయవచ్చని, ఒక కుటుంబానికి ఆధారమైన వ్యక్తి ప్రాణాలను నిలబెట్టవచ్చని తెలిపారు.బుధవారం సాయంత్రం జిల్లా కోర్టు ప్రాంగణంలోని తన ఛాంబర్ లో గౌరవ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామ్ గోపాల్.. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీకంసీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా.. మంచి మనసున్న సహాయకుల (గుడ్ సమారిటన్) హక్కులు, రోడ్డు ప్రమాద బాధితుల రక్షణకు సంబంధించిన పత్రమైన (గుడ్ సమారిటన్ అండ్ యాక్సిడెంట్ విక్టిమ్ ప్రొటెక్షన్ చార్టర్) గురించి ఆయన వివరించారు.సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం రోడ్డు ప్రమాద బాధితులకు, వారికి స్వచ్ఛందంగా సహాయం చేసే వ్యక్తులకు చట్టపరమైన రక్షణ కల్పించినట్లు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారికి ఎలాంటి జాప్యం లేకుండా తక్షణ అత్యవసర వైద్యం అందించాలని, పోలీసు విచారణ లేదా ఇతర చట్టపరమైన ప్రక్రియలు పూర్తికాలేదనే కారణంతో చికిత్సను నిరాకరించరాదని స్పష్టం చేశారు. వైద్యం ప్రారంభించడానికి ముందుగా ఎలాంటి నగదు చెల్లింపులు చేయాలని కోరరాదని, బాధితుడి ప్రాణాలను కాపాడటమే ఆసుపత్రుల మొదటి ప్రాధాన్యంగా ఉండాలని పేర్కొన్నారు.

సహాయం చేసిన వారిని ఇబ్బంది పెట్టకూడదు..

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని స్వచ్ఛందంగా ఆసుపత్రికి తీసుకెళ్లి సహాయం చేసే వ్యక్తిని మంచి మనసున్న సహాయకుడిగా (గుడ్ సమారిటన్) పరిగణిస్తారని తెలిపారు. బాధితుడిని ఆసుపత్రిలో చేర్చిన వెంటనే సహాయం చేసిన వ్యక్తి అక్కడి నుంచి వెళ్లిపోవచ్చని, తన పేరు, చిరునామా, ఇతర వ్యక్తిగత వివరాలు వెల్లడించాల్సిన తప్పనిసరి అవసరం లేదని వివరించారు. స్వచ్ఛందంగా వెల్లడించాలనుకుంటే మాత్రమే ఆ వివరాలు ఇవ్వవచ్చన్నారు.సహాయం చేసిన వ్యక్తిని ఆసుపత్రిలో నిర్బంధించరాదని, బాధితుడి వైద్య ఖర్చులు చెల్లించాలని బలవంతం చేయరాదని, ఆసుపత్రి సిబ్బంది వారితో మర్యాదగా, గౌరవంగా వ్యవహరించాలని తెలిపారు. అనవసర ప్రశ్నలతో వేధించడం, సహాయం చేసినందుకు ఇబ్బందులకు గురిచేయడం చేయకూడదని స్పష్టం చేశారు.

ముందు ప్రాణాలు కాపాడాలి.. ఆ తర్వాతే లాంఛనాలు..

ఆసుపత్రులు ప్రమాద బాధితులకు తక్షణ చికిత్స అందించడంలో నిర్లక్ష్యం చూపరాదని, పోలీసు ప్రక్రియలు లేదా ఇతర లాంఛనాల కోసం వైద్యం ఆలస్యం చేయకూడదని తెలిపారు. బాధితుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఫిర్యాదులకు ప్రత్యేక అధికారి..

ప్రమాద బాధితుల హక్కులు లేదా సహాయకుల హక్కులకు భంగం కలిగితే సంబంధిత ఆసుపత్రిలోని నోడల్ అధికారి లేదా వైద్య పర్యవేక్షకుడిని సంప్రదించి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఇందుకోసం సంబంధిత అధికారి పేరు, ఫోన్ నంబరు, ఈమెయిల్ వివరాలను ఆసుపత్రిలో అందుబాటులో ఉంచాలని సూచించారు.

ప్రజల మరియు వివిధ శాఖల బాధ్యత..

రోడ్డు ప్రమాదాలు (యాక్సిడెంట్) వంటి విపత్కర పరిస్థితుల్లో బాధితులను కాపాడేందుకు ప్రజలు వెంటనే ముందుకు వచ్చి స్పందించాలని, అలాగే సమాజంలో ప్రతి ఒక్కరితో పాటు అన్ని ప్రభుత్వ శాఖలు కూడా తమ వంతు బాధ్యతగా వ్యవహరించాలని ఈ సందర్భంగా తెలిపారు.రోడ్డు ప్రమాద సమయంలో మనం చూపించే మానవత్వం ఒక కుటుంబానికి జీవితాంతం గుర్తుండిపోయే సహాయంగా నిలుస్తుందని, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడానికి ఎవరూ వెనుకాడవద్దని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామ్ గోపాల్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

వైసీపీ నాయకులు, కార్యకర్తలు పడిన కష్టాన్ని ఎప్పటికీ
మర్చిపోను.. ప్రతి ఒక్కరికీ అండగా ఉంటా..

- అతి తక్కువ మెజార్టీతో ఓటమి చెందినా.. మీ పోరాట స్ఫూర్తి మరువలేనిది..!
- పరిగిలో ఉషశ్రీ చరణ్ ఆత్మీయ సమీక్ష.. ఓటమి చెందిన వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థులకు ఘన సన్మానం..!

పెనుకొండ నవంబర్ 11, అనంత జనశక్తి న్యూస్



పరిగి మండల కేంద్రంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండలానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలతో మాజీ మంత్రివర్యులు, సత్యసాయి జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీమతి ఉషశ్రీ చరణ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు చేసిన కృషిని అభినందిస్తూ, వారి కష్టాన్ని ఎప్పటికీ మర్చిపోనని తెలిపారు. అధికార పార్టీ అభ్యర్థులతో హోరాహోరీగా పోరాడి, అతి తక్కువ మెజార్టీతో ఓటమి చెందిన వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థులను ఆమె ఘనంగా సన్మానించారు.

గెలుపోటములు సహజమని, ప్రజల కోసం, పార్టీ కోసం కష్టపడిన ప్రతి నాయకుడికి, కార్యకర్తకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పార్టీ శ్రేణులందరూ ఐక్యంగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలని ఉషశ్రీ చరణ్ పిలుపునిచ్చారు..



మలబద్ధకంతో విసిగిపోయారా, ఇప్పుడు చెప్పేవి తీసుకుంటే కడుపు మొత్తం ఖాళీ అవ్వాల్సిందే

సరైన ఆహారం తీసుకోకపోవడం, ఒత్తిడి పెరగడం, పోషకాహారం తీసుకోకపోవడం, నిద్ర లేమి, నీరు ఎక్కువగా తాగకపోవడం ఇలాంటి ఎన్నో కారణాల వల్ల చాలా మందికి మలబద్ధకం సమస్య ఉంటుంది. దీనిని నేచురల్‌గా దూరం చేసుకునేందుకు కొన్ని ఇంటి చిట్కాలు హెల్ప్ చేస్తాయని చాలా మంది జీరా వాటర్, గోరువెచ్చని నీరు తాగుతారు. అయితే, దాని బదులు, మరికొన్ని మంచి టిప్స్ ఉన్నాయని వీటిని ఫాలో అయితే ఎలాంటి మెడిసిన్ వాడకుండానే కాన్స్టిపేషన్ తగ్గుతుందని న్యూట్రిషనిస్ట్ శ్వేతా షా చెబుతున్నారు. అలాంటి టిప్స్ ఏంటో తెలుసుకోండి.



జీరా వాటర్ బదులు

చాలా బదులు జీర్ణ సమస్యలు రాగానే జీరా వాటర్, వేడి నీరు తాగడం చేస్తుంటారు. అలా కాకుండా ఈ సారి కొద్దిగా గోరువెచ్చని నీటిలో నెయ్యిని కలిపి తాగి చూడండి. దీంతో మలం మృదువుగా మారుతుంది. దీంతో మలవిసర్జన సాఫీగా జరుగుతుంది. నెయ్యి నేచురల్ లాక్సేటివ్‌గా పనిచేస్తుంది. దీనిని తీసుకోవడం వల్ల మలం మొత్తం మృదువుగా మారి మల విసర్జన సరిగా జరుగుతుంది. దీంతో బవెల్ మూమెంట్స్ సరిగా ఉంటాయి. దీనికోసం ఓ కప్పు గోరువెచ్చని నీరు లేదా పాలలో 1 టీస్పూన్ నెయ్యి వేసి కలిపి పరగడపున తాగండి. దీని వల్ల చాలా వరకూ మలబద్ధకం దూరమవుతుంది.

ఇసబ్‌గోల్ బదులు ప్రూన్స్

చాలా మంది ఇసబ్‌గోల్‌ని మలబద్ధకాన్ని తగ్గించేందుకు వాడతారు. అయితే, ఇది అందరికీ అందుబాటులో ఉండదు. ఉన్నా కూడా దీనికంటే మెరుగైనది తీసుకోవాలనుకుంటే ప్రూన్స్ పండ్లు తీసుకోండి. ఇవి కూడా నేచురల్



లాక్సేటివ్ గుణాలని కలిగి ఉండి గట్ హెల్త్‌ని సరిగ్గా చేస్తాయి. ప్రూన్స్ పండ్లలో హై ఫైబర్, నేచురల్ షుగర్ ఆల్కహాల్ గుణమైన సార్బిటోల్ ఉంటుంది. దీని వల్ల స్టూల్ సాఫ్ట్ అవుతుంది. బవెల్ మూమెంట్స్ పెరుగుతాయి. రోజుకి 5 నుంచి 8 ప్రూన్స్ పండ్లు తింట నీరు ఎక్కువగా తాగండి. ఆటోమేటిగ్గా కాన్స్టిపేషన్ తగ్గుతుంది.

బొప్పాయి



మలబద్ధకాన్ని దూరం చేయడంలో బొప్పాయి చాలా బాగా పనిచేస్తుంది. దీనిని తినడం వల్ల బవెల్ మూమెంట్స్ పెరుగుతాయి. బొప్పాయి తినడం వల్ల మలబద్ధకం చాలా వరకూ తగ్గుతుంది. ఇందులోని ఫైబర్, నీటిశాతం పపైన్ అనే ఎంజైమ్ మలబద్ధకాన్ని దూరం చేస్తుంది. ఇందులోని సోల్యూబుల్ ఫైబర్ స్టూల్‌ని బయటికెళ్లేలా చేస్తుంది. పపైన్ ప్రోటీన్స్‌ని బ్రేక్ చేస్తుంది. జీర్ణ వ్యవస్థని ఈజీ చేస్తుంది. దీంతో బవెల్ మూమెంట్స్ పెరుగుతాయి.

అందుకోసం బాగా పండిన బొప్పాయి పండుని తీసుకోవడం మంచిది.

పాల బదులు ఆముదం నీరు

పాలు అందరికీ పడకపోవచ్చు. కొంతమందికి దీని వల్ల జీర్ణం లేట్‌గా అవుతుంది. అలా కాకుండా గోరువెచ్చని నీటిలో హాఫ్ టీస్పూన్ ఆముదాన్ని కలిపి నిద్రపోయేముందు తాగండి. దీంతో కొలన్ క్లెన్స్



అవుతుంది. గోరువెచ్చని నీటిలో మనం ఆముదం కలిపి తాగడం వల్ల చాలా వరకూ మలబద్ధకం తగ్గుతుంది. ఇందులోని లాక్సేటివ్ గుణాలు మలబద్ధకాన్ని తగ్గిస్తాయి. ఆముదాన్ని తీసుకోవడం వల్ల మజిల్స్ స్టిమ్యులేట్ అవుతాయి. కడుపు మొత్తం క్లీన్ అవుతుంది. మలబద్ధకం తగ్గుతుంది.

వీటితో పాటు

ఎక్కువగా ఫైబర్ ఫుడ్స్ తీసుకోవాలి. కూరగాయలు, పండ్లు, చిక్కుళ్లు, నట్స్, హోల్ గ్రెయిన్స్, ఓట్స్, బ్రౌన్ రైస్ వంటివి తీసుకోవాలి.

ఎక్కువగా నీరు తాగాలి. రోజుకి కనీసం 8 నుంచి 10 కప్పుల వరకూ తీసుకోవాలి.

ప్రోబయోటిక్స్ అయిన పెరుగు, కెఫిర్ వంటివి తీసుకుంటే జీర్ణ వ్యవస్థ మెరుగ్గా మారుతుంది.

ఒమేగా 3 రిచ్ ఫుడ్స్ తీసుకోవాలి. చేపలు, అవకాడో, అవిసెలు తీసుకోవాలి.

అంతేకాకుండా, రెగ్యులర్‌గా వర్కౌట్ చేయాలి.

ఆముదం, రోజ్‌మేరీ ఆయిల్ రెండింటిలో ఏది బెటర్, జుట్టు పెరగడానికి ఆముదం బాగా పనిచేస్తుందా,





ఆముదం, రోజ్‌మేరీ ఆయిల్ రెండు కూడా ముందుగా సహజమైన ఆయిల్స్. ఈ పవర్‌ఫుల్ ఆయిల్స్ రాయడం వల్ల జుట్టు కుదుళ్ళు బలంగా మారతాయి. అంతేకాకుండా, జుట్టుకి పోషణ అందుతుంది. జుట్టు రాలిపోకుండా ఉండడానికి హెల్ప్ చేస్తుంది. ఇందులో ఒక్కో నూనెలో ఒక్కో పోషకం ఉంటుంది. ఇవి జుట్టుకి సంబంధించిన సమస్యల్ని దూరం చేస్తాయి. జుట్టు చిట్లడం, డ్రై హెయిర్ వంటి సమస్యలుంటే మీరు కొబ్బరినూనె మాత్రమే కాకుండా కొబ్బరినూనెలో కొద్దిగా రోజ్‌మేరీ, ఆముదం కలిపి రాసి చూడండి. మీకే తేడా తెలుస్తుంది. విడివిడిగా దేనికది ప్రత్యేకమే.. అయితే జుట్టుని కాపాడడంలో ఏది బెటర్ అంటే కొన్ని విషయాలని గమనించాలి.

ఆముదం

ఆముదంలో రిసినోలిక్ యాసిడ్ ఉంటుంది. ఇది యాంటీ మైక్రోబయల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు, స్కాల్ప్‌ని హెల్దీగా మార్చి బలమైన జుట్టుని అందిస్తాయి. ఆముదం జుట్టుకి హెల్ప్ చేస్తుంది. ఇందులో జుట్టు పెరుగుదలకి హెల్ప్ చేసే ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్ ఈ, ఖనిజాలు ఉంటాయి.

జుట్టుకుదుళ్ళలోకి లోతుగా చొచ్చుకుపోతుంది. జుట్టుకి లోపలి నుండి పోషణని అందిస్తుంది. దీనిని రాస్తే జుట్టు పెరుగుతుంది. జుట్టు రాలకుండా ఒత్తుగా పెరుగుతుంది. దీంతో జుట్టు మెరుస్తుంది. రెగ్యులర్‌గా వాడే కొబ్బరినూనెతో కలిపి రాయడం వల్ల హెల్దీ, బలమైన జుట్టు మీ సొంతమవుతుంది.

రోజ్‌మేరీ ఆయిల్

రోజ్‌మేరీ ఆయిల్ రక్తప్రసరణని ప్రేరేపించి, ఇన్‌ఫ్లమేషన్‌ని తగ్గిస్తుంది. దీంతో పాటు జుట్టు రాలడానికి కారణమయ్యే హార్మోన్ DHT ని కంట్రోల్ చేస్తుంది. రోజ్‌మేరీ ఎసెన్షియల్ ఆయిల్‌ని రోజ్‌మేరీతో తయారుచేస్తారు. దీనిని శతాబ్దాలుగా వాడుతుంటారు. దీనిని వాడడం వల్ల జుట్టు పెరుగుదలకి అవసరమైన పోషకాలు పుష్కలంగా అందుతాయి. దీనిలో కాల్షియం, విటమిన్ బి, ఐరన్‌లు ఉంటాయి. ఇది తలపై చర్మాన్ని క్లీన్‌గా మార్చడమే కాకుండా రక్తప్రసరణని



పెంచుతుంది. జుట్టు కుదుళ్ళని ఉత్తేజపరిచి జుట్టుని మెరిసేలా చేస్తుంది.

వాటిని కలిపితే

ఆముదం, రోజ్‌మేరీ కలిపి మసాజ్ చేసినప్పుడు సున్నితంగా మసాజ్ చేయండి. కొన్ని గంటల పాటు చేస్తే రక్తప్రసరణ పెరుగుతుంది. జుట్టు పెరుగుదలకి హెల్ప్ అవుతుంది. వారానికి, 2, 3సార్లు చేస్తే మంచి రిజల్ట్ ఉంటుంది. కాబట్టి, ఈ మధ్యకాలంలో ఎక్కువగా రోజ్‌మేరీ ఆయిల్ పాపులర్ అవుతుంది.



కొబ్బరినూనెలో కలపడానికి ఏది మంచిది

మీరు కొబ్బరినూనెతో రోజ్‌మేరీ, లేదా ఆముదాన్ని కలపాలనుకుంటే మీ అవసరాలను బట్టి వాడండి. జుట్టు పెరగాలనుకుంటే ఆముదాన్ని సెలక్ట్ చేసుకోండి. దీని వల్ల కొత్త జుట్టు పెరుగుతుంది. స్కాల్ప్ మెల్ట్ మెరుగవుతుంది. ఉన్న జుట్టు ఆరోగ్యంగా ఉండాలనుకుంటే రోజ్‌మేరీ ఆయిల్‌ని కలపండి.

బెస్ట్ రిజల్ట్స్ కోసం

మీరు వారానికి 1 నుంచి 2 సార్లు జుట్టుకి



ఆముదాన్ని రాయండి. రెగ్యులర్‌గా రాస్తే జుట్టు జిడ్డుగా మారడమే కాకుండా చర్మ రంధ్రాలు మూసుకుపోతాయి. కాబట్టి, మితంగా వాడండి. నూనెని కొద్దిగా వేడి చేసి 15 నిమిషాల తలపై మసాజ్ చేసి మైల్డ్ షాంపూతో క్లీన్ చేయండి. వారంలో రెగ్యులర్‌గా వాడితే జుట్టు కుదుళ్ళు ఉత్తేజితమవుతాయి. రక్తప్రసరణ మెరుగై, జుట్టు బలంగా మారుతుంది. దీంతో జుట్టు మందంగా కూడా మారుతుంది.



వారికి కొంచెం కుర్చీలు వేయండి: సోనూసూద్ పోస్ట్

విమానాశ్రయాలు, హోటళ్లలో పనిచేసే సిబ్బంది సంక్షేమంపై నటుడు సోనూసూద్ కీలక విజ్ఞప్తి చేశారు. గంటల తరబడి నిలబడి విధులు నిర్వహించే ఉద్యోగులకు విశ్రాంతి తీసుకునే సౌకర్యం కల్పించాలని విమానాశ్రయ అధికారులు, హోటల్ యాజమాన్యాలను కోరారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్నారు.“విమానాశ్రయ కౌంటర్లు, హోటల్ రిసెప్షన్లు, సర్వీస్ డెస్క్‌లలో పనిచేసే సిబ్బంది 10 నుంచి 12 గంటల పాటు నిలబడే విధులు నిర్వహించడం మనం చూస్తుంటాం. వాళ్లు చిరునవ్వుతో మనకు స్వాగతం పలుకుతూ సేవలు అందిస్తుంటారు. అయితే ఇన్ని గంటల పాటు నిలబడటం ఎంత శారీరకంగా అలసట కలిగిస్తుందో ఎప్పుడైనా ఆలోచించారా?. ఇలాంటి పని ప్రదేశంలో తప్పనిసరిగా ఎత్తైన స్టూల్ లేదా సరైన కుర్చీ ఏర్పాటు ఉండాలి. ఉద్యోగులు కూర్చుని విశ్రాంతి తీసుకునే అవకాశం కల్పించాలి. హాస్పిటాలిటీ రంగం అంటే ప్రజలకు సౌకర్యాన్ని అందించడం. మరి మనకు సౌకర్యాన్ని కల్పించే ఉద్యోగుల పట్ల కూడా అదే శ్రద్ధ ఎందుకు చూపించకూడదు?” అని యాజమాన్యాన్ని అడిగారు.



సిద్ధు జొన్నలగడ్డ కొత్త ప్రేమకథ

టాలీవుడ్ యంగ్ హీరో సిద్ధు జొన్నలగడ్డ మరో ఆసక్తికరమైన ప్రాజెక్టుతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన హీరోగా తెరకెక్కనున్న కొత్త సినిమాకు ‘సిద్ధు 10’ అనే వర్కింగ్ టైటిల్‌తో పోస్టర్ విడుదలైంది. నేడు పూజా కార్యక్రమాలతో సినిమా ప్రారంభమైంది. ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ క్లాప్ కొట్టి సినిమాను ప్రారంభించారు. దర్శకుడు బుచ్చిబాబు, దర్శకురాలు నందినిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఇందులో సిద్ధుకు జోడీగా నయన్ సారిక నటించనున్నారు. రొమాంటిక్ డ్రామాగా రూపొందనుంది. ఈ సినిమాకు మోహన్ బి దర్శకత్వం వహించనున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు జి.వి. ప్రకాశ్ కుమార్ సంగీతాన్ని అందించనున్నారు. సుకుమార్ రైటింగ్స్, బన్నీ వాస్ వర్క్స్ సంయుక్తంగా నిర్మించనున్నాయి. భిన్నమైన కథలు, కామెడీ టైమింగ్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సిద్ధు.. ఈసారి ప్రేమకథతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. మరి సిద్ధు, నయన్ సారిక జంట వెండితెరపై ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో చూడాలి.



నా రొమాంటిక్ డేట్ ఎలా ఉండాలంటే..:



హైదరాబాద్‌లో నాకు బాగా నచ్చేది నీలోఫర్ బన్ మస్కా. అది తినేందుకు ఎవరూ గుర్తుపట్టకుండా క్యాప్ పెట్టుకొని వెళ్లేదాన్ని. అయినా కొందరు కనిపెట్టారు. తెలుగు ప్రేక్షకులు అన్ని భాషల సినిమాలూ చూస్తారు. వారి అభిమానం చూసి ఆశ్చర్యమేసింది.

స్కూల్‌లో చదువుతున్నప్పుడు మోనో యాక్టింగ్, స్కిట్స్‌లో పాల్గొన్నా. ఎప్పుడూ సినిమాల్లోకి వెళ్లాలనుకోలేదు. అయితే ఓ సినిమా ఆడిషన్స్ ప్రకటన చూసి నా ఫ్యామిలీ ఫ్రెండ్స్ ఎంకరేజ్ చేశారు. సుమారు 6 వేల మందిని ఆడిషన్ చేసి నన్ను సెలెక్ట్ చేయడంతో నమ్మలేకపోయా.

చిరంజీవిగారితో కలసి ‘కాకా’లో నటించడం ఓ మంచి అనుభూతి. ఆయనది గొప్ప వ్యక్తిత్వం. ఇతరులతో ఎంతో హుందాగా వ్యవహరిస్తారు. సెట్లో ప్రొఫెషనల్‌గా ఉంటూనే చాలా సరదాగానూ గడుపుతారు. ఆయన్నుంచి ఎంతో నేర్చుకోవచ్చు. అల్లు అర్జున్‌కు పెద్ద ఫ్యాన్‌ని. ఆయన ప్రతి సినిమా మలయాళంలోకి డబ్బింగ్ అయ్యేది. తన సినిమాలకు ఫ్రెండ్స్ అందరం వెళ్లి థియేటర్లో గోలగోల చేసేవాళ్లం. ఇప్పటివరకూ ఆయన్ను కలిసే అవకాశం రాలేదు.

నా చర్మం బాగుంటుందని చాలా మంది చెబుతుంటారు. స్కిన్ కేర్ కోసం రోజూ సన్‌స్క్రీన్, మంచి మాయిశ్చరైజర్ వాడతాను. నీళ్లు ఎక్కువగా తాగుతా. ఐదేళ్ల క్రితం స్పోర్ట్స్ బాగా ఆడేదాన్ని. ఆ టైమ్‌లో చర్మం ట్యాన్ అవకుండా సన్‌స్క్రీన్ మంచి ఫలితాన్నిచ్చింది. అబ్బాయిల్లో ఎమోషన్స్ పరంగా మెచ్యూరిటీతో ఉండేవారు, మృదువుగా మాట్లాడేవారు ఇష్టం. ఆల్ఫా రకం అబ్బాయిలు నచ్చరు. బాహ్యరూపం కన్నా వారి వ్యక్తిత్వం, మాట్లాడే విధానమే నాకు నచ్చుతుంది.

సముద్ర నేపథ్యంతో సూర్య ‘పడగోట్టి’?

కథానాయకుడు సూర్యకి ఈ ఏడాది బాగా కలిసొచ్చింది. ‘వీరభద్రుడు’, ‘విశ్వనాథ్ అండ్ సన్స్’ చిత్రాలతో వరుస విజయాలందుకున్న ఆయన.. ఈ దీపావళికి ‘సీన్’తో బాక్సాఫీస్ బరిలో నిలిచిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం దీనికి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. ఈ నేపథ్యంలోనే తన తదుపరి సినిమాలపై అంచనాలు రెట్టింపవుతున్నాయి. సూర్య ఇప్పుడు టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో ఓ చిత్రం చేస్తున్న విషయం తెలిసిందే. దీని తర్వాత ఆయన మతిమారన్ పుగళేందితో ఓ సినిమా పట్టాలెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇది మతిమారన్ గత చిత్రం ‘మండాడి’లాగే సముద్ర నేపథ్యంలో సాగే యాక్షన్ డ్రామాగానే ఉండనుందని సమాచారం. అంతేకాదు దీని కోసం ‘పడగోట్టి’(నావికుడు) అనే టైటిల్‌ని పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఇది సూర్య 49వ సినిమాగా సెట్స్‌పైకి వెళ్లనుందని.. కలైపులి ఎస్.థాను నిర్మించే అవకాశముందని తెలుస్తోంది.



యూఏఈకి ఆడతా: శ్రీకర్ భరత్

అంతర్జాతీయ క్రికెట్లో పునరాగమనంపై దృష్టిసారించినట్లు భారత మాజీ వికెట్ కీపర్ కోన శ్రీకర్ భరత్ అన్నాడు. కూలింగ్ ఆఫ్ పీరియడ్ (నాలుగేళ్ల విరామ కాలం) ముగిసిన తర్వాత అంతర్జాతీయ క్రికెట్లో యూఏఈ జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించే ఆలోచనలో ఉన్నట్లు 33 ఏళ్ల భరత్ తెలిపాడు. 2023 నుంచి 2024 వరకు భారత్ తరపున అతను ఏడు టెస్టులు ఆడాడు. ఈ ఏడాది జూన్‌లో రిటైర్మెంట్ ప్రకటించడంతో ప్రపంచవ్యాప్తంగా టీ20 లీగ్‌లలో ఆడేందుకు అతనికి అర్హత లభించింది. ప్రస్తుతం అబుదాబి టీ10 లీగ్‌లో ఎమిరేట్స్ ఈగల్స్ జట్టుకు భరత్ ప్రాతినిధ్యం వహిస్తున్నాడు.

“దేశం తరపున టెస్టు క్రికెట్ ఆడటమే అత్యున్నత అనుభూతి. దానికి ఏదీ సాటిరాదు. అయితే ఒక ఆటగాడిగా మైదానంలో ఎప్పుడూ ఆడాలనే ఉంటుంది. కొన్నేళ్లుగా దేశవాళీ క్రికెట్లో నిలకడగా రాణిస్తున్నా. కానీ నాలో ఇంకా అంతర్జాతీయ స్థాయిలో ఆడే సత్తా ఉందని అనిపించింది. అందుకే జూన్‌లో కఠినమైన నిర్ణయం తీసుకున్నా. 2027 ఫిబ్రవరి నాటికి విరామ కాలం ముగుస్తుంది. యూఏఈ తరపున అంతర్జాతీయ క్రికెట్ ఆడాలని అనుకుంటున్నా. యూఏఈ బోర్డు నన్ను ఆదరించి.. వారి మౌలిక వసతులను ఉపయోగించుకునేందుకు అనుమతించడం చాలా సంతోషంగా ఉంది. ఇక్కడ దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, అఫ్గానిస్థాన్, శ్రీలంక, పాకిస్థాన్‌తో పాటు భారత్ నుంచి వచ్చిన నాణ్యమైన ఆటగాళ్లతో కలిసి ఆడే అవకాశం లభిస్తోంది. నా కెరీర్‌లో ఈ రెండో ఇన్నింగ్స్‌ను బాగా ఆస్వాదిస్తున్నా” అని భరత్ తెలిపాడు.



ఆర్యవీర్ 160.. యూఏఈపై భారత్ ఘనవిజయం

భారత జట్టు అండర్-19 ఆసియాకప్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. వీరేంద్ర సెహ్వాగ్ తనయుడు ఆర్యవీర్ సెహ్వాగ్ (160; 168 బంతుల్లో 17×4, 7×6) భారీ శతకం బాదడంతో మంగళవారం తప్పక నెగ్గాల్సిన గ్రూప్-ఎ మ్యాచ్‌లో 70 పరుగుల తేడాతో యూఏఈని చిత్తు చేసింది. ఓపెనర్ ఆర్యవీర్ విధ్వంసంతో మొదట భారత్ 7 వికెట్ల నష్టానికి 309 పరుగులు చేసింది. ఎదుర్కొన్న 14వ బంతికి ఖాతా తెరిచిన ఆర్యవీర్.. ఆ తర్వాత ఫోర్లు, సిక్స్‌లతో చెలరేగిపోయాడు. వినీత్ (67)తో రెండో వికెట్‌కు అతడు 193 పరుగులు జోడించి వెనుదిరిగాడు. యూత్ వన్డేల్లో ఆర్యవీర్ తన తొలి శతకాన్ని సాధించాడు. అతడి ఇన్నింగ్స్‌లో 110 పరుగులు ఫోర్లు, సిక్సర్ల రూపంలో వచ్చినవే. ఛేదనలో యూఏఈ 50 ఓవర్లలో 239 పరుగులకు ఆలౌటైంది. అహ్మద్ ఖుదాదద్ (74) టాప్ స్కోరర్. ఇషాన్ సూద్ (4/37) యూఏఈని దెబ్బతీశాడు. ఈ విజయంతో భారత్ గ్రూప్‌లో రెండో స్థానంతో ముందంజ వేసింది. గురువారం జరిగే సెమీఫైనల్లో అఫ్గానిస్థాన్‌ను ఢీకొంటుంది. నాన్నకు హామీ ఇచ్చా: యూఏఈపై భారీ శతకం చేస్తానని తన తండ్రికి హామీ ఇచ్చానని ఆర్యవీర్ సెహ్వాగ్ చెప్పాడు. “భారీ స్కోరు చేయాలనుకున్నా. పెద్ద ఇన్నింగ్స్ ఆడతానని మా నాన్నకు హామీ ఇచ్చా. ఆయనకు భారీ శతకాలే ఇష్టం. నాన్న వారసత్వాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత నాపై ఉంది” అని అన్నాడు.



జైపాల్ మాల్వీయ.. ‘మట్టి’లో మాణిక్యం



జైపాల్‌ది మధ్యప్రదేశ్‌లోని చింద్వారా.. ఎనిమిది మంది పిల్లలున్న కుటుంబంలో అతడే చిన్నవాడు. జైపాల్ తల్లిదండ్రులు.. విగ్రహాలు చేయడంతో పాటు చిన్న వ్యవసాయ భూమిలో మొక్కజొన్న, చిరు ధాన్యాలు, కూరగాయలు పండిస్తారు. షూటింగ్‌ను కెరీర్‌గా చేసుకోవడానికి ముందు జైపాల్ కూడా తన వంతుగా కష్టపడేవాడు. అసలు షూటింగ్ అనే ఆట ఉంటుందని తెలియని జైపాల్.. ఆ ఆటలోకి రావడం యాదృచ్ఛికం. మొదట అతడి దృష్టిలో షూటింగ్ అంటే.. జాతరలో బుడగలను తుపాకీతో కాల్చి బహుమతులు గెలుచుకోవడమే. ఒకసారి తన గ్రామానికి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న అకాడమీకి షూటింగ్ చూసేందుకు వెళ్లాడు. అక్కడ కూడా సరదా కోసమే షూటింగ్ ఆడతారని తొలుత భావించాడు. అయితే ఆ తర్వాతే షూటింగ్‌లో జాతీయ, అంతర్జాతీయ పోటీలు కూడా నిర్వహిస్తారని తెలుసుకున్నాడు. అయితే అతడు తొలుత గన్ పట్టింది మాత్రం ఎన్‌సీసీ శిక్షణలోనే. 2016-18 వరకు ఎన్‌సీసీ శిక్షణ.. షూటింగ్‌పై జైపాల్ ఆసక్తిని మరింత పెంచింది. ఒకవైపు చదువు కొనసాగిస్తూనే, ఎన్‌సీసీలోనూ తమ బెటాలియన్‌లో టాప్‌గా నిలిచాడు. ఎన్‌సీసీ శిక్షణకు వచ్చే సైనిక అధికారులు.. జైపాల్ ఉత్సాహాన్ని చూసి, అతడిని సైన్యంలో చేరమని సలహా ఇచ్చారు. కొవిడ్ కారణంగా అది కార్యరూపం దాల్చలేదు.

అర్ష్‌దీప్‌తో ట్రేడ్ కన్ఫామ్.. పెరిగిన హార్దిక్ పాండ్య ధర

ఐపీఎల్‌లో ముంబయి ఇండియన్స్‌తో హార్దిక్ పాండ్య బంధం ముగిసింది. 2027 సీజన్‌కు ముందు అతడిని పంజాబ్ జట్టుకు వదులుకున్న ఫ్రాంచైజీ .. అందుకు బదులుగా అర్ష్‌దీప్ సింగ్‌ను తీసుకుంది. ఈ ట్రేడ్‌ను ఐపీఎల్ యాజమాన్యం బుధవారం అధికారికంగా ప్రకటించింది. కాగా.. ఈ ఒప్పందంతో హార్దిక్ ధర రూ.18 కోట్లకు పెరగడం గమనార్హం. ప్రస్తుతం పాండ్య ఫీజు రూ.16.35 కోట్లుగా ఉండగా.. రూ.18 కోట్లు వెచ్చించి పంజాబ్ కింగ్స్ అతడిని తీసుకునేందుకు అంగీకరించింది. ఇక, అర్ష్‌దీప్ ను మాత్రం ఎలాంటి మార్పు లేకుండా రూ.18 కోట్ల ప్రస్తుత ధరతోనే ముంబయి దక్కించుకున్నట్లు ఐపీఎల్ తమ ప్రకటనలో వెల్లడించింది. ముంబయి జట్టుకు పాండ్య కెప్టెన్‌గా వ్యవహరించినప్పటికీ.. పంజాబ్‌లో శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోనే అతడు ఆడనున్నాడు. 2015లో ముంబయి ఫ్రాంచైజీలో చేరిన పాండ్య.. ఆ జట్టులో కీలక ఆటగాడిగా ఉన్నాడు. 2015, 2017, 2019, 2020లో ఆ జట్టు టైటిల్ గెలవడంతో మెరుగైన పాత్ర పోషించాడు. అయితే, 2022 సీజన్‌కు ముందు గుజరాత్ టైటాన్స్‌కు కెప్టెన్‌గా వెళ్లాడు. తొలి సీజన్‌లోనే ఆ జట్టుకు కప్ అందించాడు. మళ్లీ 2024కు ముందు ముంబయి జట్టులో చేరి సారథ్య బాధ్యతలు చేపట్టాడు. కానీ, పాండ్య కెప్టెన్సీలో జట్టు పేలవ ప్రదర్శన చేసింది. వ్యక్తిగతంగానూ అతడు రాణించలేదు. దీంతో హార్దిక్‌ను వదులుకోవాలని ముంబయి నిర్ణయించుకుంది. ఇందుకోసం పలు ఫ్రాంచైజీలతో చర్చించగా.. చివరకు పంజాబ్‌తో ఒప్పందం కుదిరింది. కాగా.. ఐపీఎల్‌లో ఇప్పటివరకు 162 మ్యాచ్‌లు ఆడిన పాండ్య.. 146.28 స్ట్రయిక్ రేటుతో 2,955 పరుగులు చేశాడు. 82 వికెట్లు తీశాడు. మరోవైపు, పంజాబ్ తరపునే అరంగేట్రం చేసిన అర్ష్‌దీప్ గత ఎనిమిదేళ్ల పాటు ఆ జట్టుకే ప్రాతినిధ్యం వహించాడు. ఈ లెఫ్ట్ ఆర్మ్ ఫాస్ట్ బౌలర్ 96 ఐపీఎల్ మ్యాచుల్లో 111 వికెట్లు పడగొట్టి పంజాబ్‌కు అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. అతడిని వదులుకోవడానికి పంజాబ్ యాజమాన్యం అంతగా ఇష్టపడకపోయినా.. కెప్టెన్ శ్రేయస్, కోచ్ పాంటింగ్ నిర్ణయం మేరకు ఈ ఒప్పందం జరిగినట్లు సమాచారం.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU. Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945